www.vaarthavedhikasurya.com

RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

యాదాద్రి భువనగిరి | మంగళవారం 20, జనవరి 2026 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 235 | పేజీలు: 08 | వెల: 5/-



వడ్డీ లేని రుణాలు తీసుకొని సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి

7 లో..




## అరబ్ అధ్యక్షుడు షేక్ రాక

- స్వయంగా వెళ్లి స్వాగతించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జనవరి19(వార్త వేదిక సూర్య):
యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత్ పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా దిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. కరచాలనం చేసి, ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరూ ఒకే కారులో ప్రయాణించారు. అయితే, విదేశాంగ శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం.. అల్ నహ్యాన్ కేవలం రెండు గంటలే దిల్లీలో ఉండనున్నట్లు తెలుస్తోంది. సోదరుడు, యూఏఈ అధ్యక్షుడు అల్ నహ్యాన్‌కు స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వెళ్లాను. ఇరుదేశాల మధ్య స్నేహానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ పర్యటన చాటుతోంది' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఇరు దేశాధినేతలూ చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు మిగతా 2లో..

## ప్రతి ఇంటికి సోలార్ ఎనర్జీ

- ఆదాయంతో పాటు విద్యుత్ ఆదా
- బోనకల్లులో ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం,జనవరి19 (వార్త వేదిక సూర్య):
రాష్ట్రంలో ఒక సరికొత్త సోలార్ విప్లవానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శ్రీకారం చుట్టారు. ఈ పథకం ప్రధాన ఉద్దేశం ప్రతి ఇంటిని ఒక విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చడమేనని అన్నారు. ఇకపై ప్రజలు విద్యుత్ శాఖకు బిల్లులు చెల్లించే రోజులు పోయి, విద్యుత్ శాఖే ప్రజలకు డబ్బులు చెల్లించే రోజులు వచ్చాయని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని రావినూతల గ్రామం సాక్షిగా దీనికి భట్టి శ్రీకారం చుట్టారు. తెలంగాణ ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం అత్యంత భారీగా నిధులను వెచ్చిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 81 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీనిని అమలు చేస్తుండగా, ఒక్క బోనకల్ మండల పరిధిలోనే 306 కోట్ల రూపాయలను కేటాయించారు. అందులోనూ రావినూతల గ్రామంలోని ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థల ఏర్పాటు కోసమే 24 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం గమనార్హం. ఈ పథకం ద్వారా ప్రజలకు చేకూరే ఆర్థిక ప్రయోజనాలు అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయి. ప్రతి కుటుంబం తమ ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానెళ్ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని, తమ అవసరాలకు వాడుకోగా మిగిలిన కరెంటును ప్రభుత్వానికి విక్రయించవచ్చు. ఇలా విక్రయించిన ప్రతి యూనిట్‌కు



ప్రభుత్వం రూ. 2.57 పైసల చొప్పున నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుంది. దీనివల్ల ప్రతి ఇంటికి ఏడాదికి సుమారు 15 వేల రూపాయల వరకు విద్యుత్ ఆదా అవ్వడమే కాకుండా, అదనపు విద్యుత్ అమ్మకం ద్వారా మరో 5 వేల రూపాయల వరకు నగదు ఆదాయం లభిస్తుంది. అంటే ప్రతి ఏటా మిగతా 2లో..



## ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు సిట్ నోటీసులు

- నేడు విచారణకు హాజరు కావాలని ఆదేశం

హైదరాబాద్,జనవరి19(వార్త వేదిక సూర్య):
తెలంగాణ రాష్ట్ర ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ నోటీసులు ఇచ్చింది. మంగళవారం ఉదయం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని హరీష్ రావుకు పంపిన నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో ఇతర నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా హరీష్ రావుకు సిట్ నోటీసులు పంపించింది. ఇటీవల ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు విచారణపై దర్యాప్తు సంస్థను సుప్రీం కోర్టు ప్రశ్నించింది.

ఇప్పటికే రెండు వారాల కస్టడీకి అనుమతించామని, ఇంకెంత కాలం విచారణ కొనసాగిస్తారని ప్రశ్నించింది. ఈ కేసులో విచారించడానికి ఇంకా ఏమి మిగిలి ఉందని ప్రశ్నించింది. ప్రభాకర్ రావు విచారణను త్వరగా పూర్తి చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.





## సమ్మక్క - సారలమ్మ పుణ్యక్షేత్రం పునరుద్ధరణ.. ప్రజలకు అంకితం

- సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మేడారం,జనవరి 11 (వార్త వేదిక సూర్య):
ఆదివాసీల అతిపెద్ద పండుగ అయిన మేడారం సమ్మక్క-సారలమ్మ పుణ్యక్షేత్రం పునరుద్ధరణ పూర్తయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రజలకు అంకితం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో ముఖ్యమంత్రి కుటుంబ సమేతంగా సమ్మక్క-సారలమ్మ మిగతా 2లో..





## ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు

- పోలండ్ విదేశాంగ మంత్రితో భేటీలో జైశంకర్
- ఉగ్రవాద నిర్మలనకు కలసి పనిచేస్తామని పోలండ్ హామీ


న్యూఢిల్లీ,జనవరి19(వార్త వేదిక సూర్య):
ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్ సమర్థించదని, ప్రపంచ దేశాలను కూడా ఇదే కోరుతోందని విదేశాంగ మంత్రి జై శంకర్ మిగతా 2లో..

## మరోసారి వార్తల్లో సత్యం కంప్యూటర్స్ స్కామ్

- జన్వాడ భూములపై నాంపల్లి ప్రత్యేక కోర్టు విచారణ
- సత్యం రాజుతో పాటు 213 మందికి న్యాయస్థానం నోటీసులు



హైదరాబాద్,జనవరి19(వార్త వేదిక సూర్య):
భారతదేశ ఆర్థిక చరిత్రలోనే అతిపెద్ద కార్పొరేట్ మోసాల్లో ఒకటిగా పేరుగాంచిన సత్యం కంప్యూటర్స్ స్కామ్ మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ స్కామ్‌కు సంబంధించిన జన్వాడ భూముల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములు, ముఖ్యంగా జన్వాడ ప్రాంతంలోని ల్యాండ్స్, సత్యం స్కామ్‌లో భాగంగా అక్రమంగా కొనుగోలు చేశారనే ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి. సత్యం కంప్యూటర్స్ ద్వారా దారి మళ్లించిన నిధులను వినియోగించి ఈ భూములు కొనుగోలు చేశారని ఈడీ దర్యాప్తులో తేలింది. సీబీఐ గతంలో చేసిన విచారణలో కొన్ని అంశాలు వెలుగులోకి వచ్చినప్పటికీ, హైదరాబాద్ చుట్టు పక్కల వందల ఎకరాల భూముల వివరాలు పూర్తిగా బయటపడలేదని ఈడీ అధికారులు తెలిపారు. జన్వాడ ల్యాండ్స్ వ్యవహారం రాజకీయ, వ్యాపార వర్గాల్లో పెద్ద మిగతా 2లో..




## పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా చర్యలొద్దు

- తెలంగాణ హైకోర్టు విచారణ...
- ఫిబ్రవరి 25కు వాయిదా

హైదరాబాద్,జనవరి19(వార్త వేదిక సూర్య):
కాళేశ్వరం పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ వాయిదా పడింది. కాళేశ్వరంలో జరిగిన అక్రమాలు, అవినీతి ఆరోపణలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టును మిగతా 2లో..

## రేవంత్.. దమ్ముంటే సీబీఐ విచారణ కోరు

- బొగ్గు అవినీతిపై అన్ని ఆధారాలు సమర్పిస్తా
- చీకటి ఒప్పందం లేకుంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని కిషన్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నాం
- రేవంత్ రెడ్డికి తెల్వకుండా సెట్ ఎలా వస్తుంది?
- రేవంత్ రెడ్డికి తెల్వకుండా సెట్ వస్తే ముఖ్యమంత్రిగా నువ్వు ఫెయిల్
- టీడీపీ నుంచి బయటకు వచ్చి నువ్వు ద్రోహం చేసావు
- సింగరేణి టెండర్ల విషయంలో సీఎం, భట్టి, కోమటి రెడ్డి మధ్య వాటాల పంచాయతీ కాదా?
- మధ్యలో ఐఏఎస్, జర్నలిస్టులు బలి పశువులు
- సైట్ విజిట్ విధానం శాశ్వతంగా రద్దు చేయాలి
- ఈ విధానం వచ్చాక మొదటి లబ్దిదారులు రేవంత్ బామ్మర్ది సుజన్ రెడ్డి
- ఆయన కంపెనీ శోదా కన్స్ట్రక్షన్ కే ఈ సర్టిఫికెట్ వచ్చాక, మొదటి టెండర్ దక్కింది
- నైనీ బ్లాక్‌లో వాటాల పంచాయతీ వచ్చి కొట్టుకునే పరిస్థితి
- కాంట్రాక్టు సైట్ విజిట్ పద్దతి మన దేశంలో లేదు
- రేవంత్ ప్రభుత్వం వచ్చాక 2024లో సైట్ విజిట్ విధానం
- కోల్ ఇండియా, వెస్టర్న్ కోల్ బ్లాక్ లో లేని విధానం సింగరేణిలో ఎందుకు?
- నైనీ టెండర్లు మాత్రమే రద్దు చేస్తాం అన్నారు.. మరి మిగతా వాటి సంగతి ఏమిటి?
- కమీషన్ల కోసం సింగరేణి ఇచ్చే డీజిల్ విధానం రద్దు చేశారు
- డీజీపీ .. మీ ఖాకీ బుక్కు కాకి ఎత్తుకుపోయిందా?
- సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ ఫైర్?



7 లో..

## బావమరిది సుజన్ రెడ్డి స్కామ్ బయటపడటంతో రేవంత్‌లో వణుకు

- రేవంత్ బావమరిది సుజన్ రెడ్డికి బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే హరీష్ రావుపై కక్ష సాధింపు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి పస లేదని సుప్రీంకోర్టు కేసు కొట్టేసింది
- బొగ్గు కుంభకోణం నుండి దృష్టి మళ్లించేందుకే హరీష్ రావుపై కక్ష సాధింపు
- భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,జనవరి19(వార్త వేదిక సూర్య):
రేవంత్ రెడ్డి 'డైవర్షన్ పాలిటిక్స్' ను వదిలేదే లేదు. సుప్రీంకోర్టు కొట్టేసిన కేసుతో మళ్లీ డ్రామా. బావమరిది సుజన్ రెడ్డి స్కామ్ బయటపడటంతో రేవంత్ లో వణుకు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సుజన్ రెడ్డికి సంబంధించిన బొగ్గు కుంభకోణం బయట పడటంతోనే, దాని నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు హరీష్‌రావుకి ఫోన్ ట్యాపింగ్ అంశంలో నోటీసులు ఇచ్చి 'అటెన్షన్ డైవర్షన్' రాజకీయాలకు పాల్పడుతున్నారని భారత రాష్ట్ర మిగతా 2లో..

## బిజెపి నూతన అధ్యక్షుడుగా నితిన్ నబీన్

- నితిన్‌కు మద్దతుగా నామినేషన్లు
- పోటీలో ఎవరూ లేకపోవడంతో ఏకగ్రీవ ఎన్నిక
- నేడు ప్రముఖుల సమక్షంలో ప్రమాణ స్వీకారం




న్యూఢిల్లీ, జనవరి19(వార్త వేదిక సూర్య):
భారతీయ జనతా పార్టీ చరిత్రలో సరికొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. పార్టీ అధ్యక్షుడిగా అత్యంత పిన్న వయస్కుడైన నేత నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నామినేషన్లు అన్నీ ఆయన ఒక్కరి పేరుమీదే దాఖలు అయ్యాయి. నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఢిల్లీలో నితిన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బీజేపీ నేతలు పరిశీలించారు. భారతీయ జనతా పార్టీ కి కొత్త సారథి వచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా పదవీకాలం ముగియడంతో ఈ ఎన్నిక జరిగింది. మంగళవారం ఉదయం 11 గంటలకు ఆయన పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. బిహార్‌కు చెందిన 46 ఏళ్ల నితిన్ నబీన్‌ను భాజపా కార్యనిర్వాహక మిగతా 2లో..



## అరబ్ అధ్యక్షుడు షేక్ రాక

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. అల్ నహ్యాన్‌కు ప్రధాని మోదీ చెక్కతో కళాత్మకంగా రూపొందించిన ఓ పెద్ద ఊయలను కానుకగా ఇచ్చారు. దీన్ని గుజరాత్‌లో తయారు చేశారు. ఈ

సందర్భంగా ఇద్దరు నేతలూ కలిసి కాసేపు ఆ ఊయలపై కూర్చుని సంభాషించుకున్నారు. అదేవిధంగా తెలంగాణలో తయారు చేసిన వెండి పె÷–టటెలో కశ్మీరీ పశ్మీనా శాలువాను బహుమతిగా ఇచ్చారు. అల్ నహ్యాన్ తల్లికి కూడా పశ్మీనా శాలువాతోపాటు కుంకుమ పువ్వు అందజేశారు.ఇరాన్– అమెరికా మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతినడం, యెమెన్ విషయంలో సౌదీ అరేబియా, యూఏఈల మధ్య ఉద్రిక్తతలు, గాజాలో రాజకీయ అస్థిరతలు నెలకొన్నవేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. యూఏఈ అధ్యక్ష హోదాలో అల్ నహ్యాన్ భారత్‌లో అధికారికంగా పర్యటించడం ఇది మూడోసారి. 2022లో ఇరుదేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం అనంతరం సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది.

## బిజెపి నూతన అధ్యక్షుడుగా నితిన్ నబీన్

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడిగా నియమిస్తూ గతేడాది డిసెంబరులో పార్టీ అనూహ్య ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఆయన్ను పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బిహార్ నుంచి పార్టీలో అధ్యక్షుడి స్థాయికి చేరిన తొలి నేతగా నబీన్ గుర్తింపు పొందారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ ఎంపిక చేయ డంతో పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు ప్రధాని మోదీ మంత్రివర్గం లోనూ భారీ మార్పులు ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఇదే సమయంలో 2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని.. 55ఏళ్ల లోపు వయసున్న నేతలకు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించబోతున్నారనే ప్రచారం జరుగుతోంది.

## పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా చర్యలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సవాలు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ చీఫ్ సెక్రటరీ ఎస్‌కె జోషి, సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. కేసీఆర్, హరీష్ రావ్ తరఫున సుప్రీం కోర్టు సీనియర్ కౌన్సిల్ సుందరం వాదనలు వినిపించారు. ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసింది. ప్రభుత్వ కౌంటర్‌కు పిటిషనర్లు రిప్లై÷ల్ చేశారు. రిప్లైకు ప్రభుత్వం రిటన్ సబ్మిషన్ ఇచ్చేందుకు సమయం కావాలని హైకోర్టును అడ్వకేట్ జనరల్ కోరారు. ఫిబ్రవరి 20లోపు లిఖితపూర్వకమైన సబ్మిషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను ఫిబ్రవరి 25కు వాయిదా వేసింది. అప్పటి వరకు పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్పష్టం చేసింది.

## ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. పోలండ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి అయిన రాడోస్లావ్ సికోర్స్కి బజీలి తో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ దిల్లీలో సమావేశమ య్యారు. ఈసందర్భంగా ఇరుదేశాల మధ్య సంబంధాలపై చర్చలు జరిపారు. కాగా గతేడాది అక్టోబర్‌లో పాక్ పర్యటనకు వెళ్లిన సమయంలో పోలండ్ విదేశాంగ మంత్రి జమ్మూకశ్మీర్‌పై చేసిన సూచనలపై జైశంకర్ ఆయనకు చురకలు అంటించారు. ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉంటుందని.. భారత్‌తో స్నేహాన్ని కోరుకునే దేశాలు కూడా ఉగ్రవాదంపై మెతక వైఖరి వీడాలన్నారు. ఉగ్రవాదులు ఎప్పటికైనా ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. సరిహద్దు ఉగ్రవాదం వల్ల భారత్ ఎన్ని సమస్యలు ఎదుర్కొంటుందో రాడోస్లావ్‌కు తెలుసని జైశంకర్ అన్నారు. దానిని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలే గానీ సరిహద్దుల్లో ఉగ్రవాదానికి ఆజ్యం పోయకూడదని చురకలు అంటించారు. ప్రపంచం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రత్యేకంగా భారత్‌ను మాత్రమే లక్ష్యం చేసుకోవడం అన్యాయమన్నారు. భారత్–పోలండ్ ద్వైపాక్షిక సంబంధాలపై మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయన్నారు. అయినప్పటికీ వాటిని కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. జైశంకర్ వ్యాఖ్యలపై రాడోస్లావ్ సికోర్స్కి స్పందిస్తూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌తో కలిసి పని చేస్తామన్నారు. పోలండ్ కూడా ఉగ్ర సమస్యలను ఎదుర్కొంటుందని తెలిపారు. కాగా గతేడాది పోలండ్ విదేశాంగ మంత్రి రాడోస్లావ్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిన సమయంలో అక్కడ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఆ దేశ నేతలతో కలిసి ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

## సైబరాబాద్ అడ్మిన్ డిసిపిగా టి. అన్నపూర్ణ

హైదరాబాద్,(వార్త వేదిక సూర్య):సైబరాబాద్ అడ్మిన్ డిసిపిగా టి. అన్నపూర్ణ, సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె సైబరాబాద్ సీపీ ఎం. రమేష్, ఐపీఎస్.,ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2007 లో డైరెక్ట్ డీఎస్పీగా ఎంపికైన అన్నపూర్ణ, 2013లో కన్ఫర్డ్ ఐపీఎస్ అయ్యారు. ఇంతకుముందు ఆమె విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా, ఇన్‌చార్జ్ డీఐజీగా సేవలందించారు. వికారాబాద్ ఎస్పీగా, కరీంనగర్ అడిషనల్ ఎస్పీగా, పీటీసీ వరంగల్‌లో, మంగళగిరి–గుంటూరు డీఎస్పీగా, చిత్తూరు అడిషనల్ డీసీపీగా విధులు నిర్వర్తించారు.

## బావమరిది సుజన్ రెడ్డి స్కామ్ బయటపడటంతో రేవంత్‌లో వణుకు

(మొదటి పేజీ తరువాయి)

సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు మండిపడ్డారు. రాజకీయ వేధింపులే పరమావధిగా కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తోందని ఆయన ధ్వజమెత్తారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి పస లేదని, అది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్య మాత్రమేనని సాక్షాత్తూ సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా తేల్చి చెప్పిందని కేటీఆర్ గుర్తు చేశారు. అత్యున్నత న్యాయస్థానమే ఆ కేసును కొట్టేసి, ఈ పొలిటికల్ డ్రామాకు తెరదించినా.. మళ్లీ ఇప్పుడు మాజీ మంత్రి హరీష్ రావు గారికి నోటీసులు ఇవ్వడం చూస్తుంటే రేవంత్ రెడ్డి సర్కార్ ఎంత దిగజారిందో అర్థమవుతోందని ఆయన విమర్శించారు. అసలు ఈ నోటీసుల వెనుక ఉన్న కారణం ఇప్పుడు రాష్ట్ర ప్రజలందరికీ అర్థమైపోయిందని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సూదిని సృజన్ రెడ్డికి అడ్డగోలుగా జరిగిన బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాన్ని, తాము సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టామని, ఈ భారీ స్కామ్ నుండి తప్పించుకోవడానికే రాత్రికి రాత్రే హరీష్ రావు కి నోటీసులు పంపారని కేటీఆర్ ఆరోపించారు. ఇది పక్కాగా రేవంత్ రెడ్డి మార్క్ 'డైవర్షన్ పాలిటిక్స్' అని ఎద్దేవా చేశారు. హరీష్ రావు ను చూసి రేవంత్ రెడ్డికి వణుకు పుడుతోందని కేటీఆర్ అన్నారు. అందుకే రాజకీయంగా ఎదుర్కోలేక, పాతపడిపోయిన కేసులతో ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు. ఏ విచారణకైనా తాము సిద్ధమని స్పష్టం చేస్తూనే.. నోటీసులతో ప్రతిపక్ష గొంతు నొక్కాలని చూడటం భ్రమ మాత్రమేనని హెచ్చరించారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా ప్రజల పక్షాన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని వేటాడటం ఆపేది లేదని, కుంభకోణాలను బయటపెడుతూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ప్రతి ఇంటికి సోలార్ ఎనర్జీ

(మొదటి పేజీ తరువాయి)

ఒక కుటుంబం సుమారు 20 వేల రూపాయల ఆర్థిక వెసులుబాటును పొందుతుంది. ఈ మొత్తాన్ని మహిళలు తమ పిల్లల చదువులకో లేదా ఇతర ఇంటి అవసరాలకో వాడుకోవచ్చని భట్టి విక్రమార్క సూచించారు. కేవలం గృహ వినియోగదారులకే కాకుండా, రైతులకు కూడా ఈ పథకం ద్వారా 'డబుల్ ధమాకా' లభించనుంది. పొలాల్లోని వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం తన సొంత ఖర్చుతో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తుంది. పంట లేని సమయంలో లేదా మోటార్లు వాడనప్పుడు కూడా ఉత్పత్తి అయ్యే



విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం కలుగుతుంది. అంతేకాకుండా, ఈ సోలార్ ప్యానెళ్లను ఎనిమిది అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయడం వల్ల వాటి కింద ఒక పక్కా షెడ్డు లాంటి వసతి ఏర్పడుతుంది. అక్కడ రైతులు పశువులను కట్టుకోవడానికి, వ్యవసాయ పరికరాలు దాచుకోవడానికి లేదా మధ్యాహ్న సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి వీలుంటుంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'గ్రీన్ ఎనర్జీ'ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, రైతులు కూడా వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు పొలాల్లో చెత్తను కాల్చవద్దని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు.

## డిజిపి స్థాయి అధికారి రాసలీలలు

### కార్యాలయంలోనే మహిళలతో ముద్దుముచ్చట

### బయటపడ్డ వీడియోలు.. విచారణకు ఆదేశం

బెంగళూరు,(వార్త వేదిక సూర్య):డీజీపీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి రాసలీలలు బయటపడ్డాయి. తన కార్యాలయంలో మహిళలతో సన్నిహితంగా ఉన్న వీడియోలు బయటకు రావడంతో కర్ణాటకలో వివాదం చెలరేగింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన దృశ్యాలపై దర్యాప్తు కొనసాగుతోందని.. అవి నిజమని తేలితే సదరు అధికారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోల్లో కర్ణాటక సీనియర్ పోలీసు అధికారి కె.రామచంద్రరావు తన



కార్యాలయంలో పలువురు మహిళలతో సన్నిహితంగా ఉన్నట్లు కనిపిస్తోంది. డీజీపీ కార్యాలయంలోని సిబ్బంది ఈ దృశ్యాలను రహస్యంగా చిత్రీకరించినట్లు తెలుస్తోంది. విధి నిర్వహణ సమయంలో సీనియర్ అధికారి ఇలా ప్రవర్తించడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వివాదం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దృష్టికి వెళ్లడంతో ఘటనపై దర్యాప్తు చేసి, వివరణ ఇవ్వాలని సంబంధిత శాఖకు సూచించారు. అయితే సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియోలు నిజం కావని.. తన ఫొటోలను మార్ఫింగ్ చేశారని సీనియర్ పోలీసు అధికారి రామచంద్రరావు పేర్కొన్నారు. తనను ఉద్యోగం నుంచి తొలగించడానికి నా పైఅధికారులు ఉద్దేశపూర్వకంగా ఇలా చేశారని ఆరోపించారు. కాగా గతేడాది బంగారం అక్రమరవాణా కేసులో అరెస్టైన కన్నడ నటి రన్యారావుకు రామచంద్రరావు సవతి తండ్రి. అప్పట్లో బంగారం అక్రమ రవాణా కేసులో ఆయన పేరు వాడుకునే విమానాశ్రయాల్లో రన్యారావు భద్రతా తనిఖీలను తప్పించుకునేదని ఆరోపణలు వచ్చాయి.



## సమ్మక్క - సారలమ్మ పుణ్యక్షేత్రం పునరుద్ధరణ.. ప్రజలకు అంకితం

(మొదటి పేజీ తరువాయి)

అమ్మవార్లను దర్శించుకుని ఆశీర్వాదం పొందారు.

దాదాపు వెయ్యేళ్ల వీరగాథకు, జాతి వారసత్వ సంపదకు సంబంధించిన చరిత్రకు అద్దం పట్టేలా రూపుదిద్దుకున్న మేడారం గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని పునఃప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రివర్గ సహచరులు, ప్రజాప్రతినిధులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు గద్దెల ప్రాంగణంలో పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.



## పార్టీ వ్యవహారాలపై కవిత వేగంగా అడుగులు

### పలువురు ప్రముఖులతో వరుస భేటీలు

### వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో సమాలోచనలు

హైదరాబాద్,(వార్త వేదిక సూర్య):

వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయాల్లో బలమైన ముద్ర వేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావిస్తున్నారు. ఇప్పటికే ఆమె ఆ దిశగా కసరత్తు మొదలు పెట్టారు. బలమైన శక్తిగా తిరిగి వస్తానంటూ ఆమె మండలిలో భావోద్వేగ ప్రసంగం చేశారు.

తెలంగాణ జాగృతినే పార్టీ మార్చి ముందుకు వెళ్లాలన్న సమాలోచనలు చేస్తున్నారు. సొంత పార్టీని స్థాపించడం ద్వారా ఎన్నికలకు వెళ్లాలని ఆమె నిర్ణయించినట్లు తెలుస్తోంది. అందుకోసం ఆమె వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్‌తో కవిత వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. దాదాపు 60 రోజుల వ్యవధిలో రెండుసార్లు ప్రశాంత్ కిశోర్ హైదరాబాద్ వచ్చి.. కవితతో భేటీ అయినట్లు సమాచారం.

సంక్రాంతి పండగ వేళ.. హైదరాబాద్‌లో కవిత, పీకేలు సమావేశమయ్యారని తెలుస్తోంది. . ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల కోసం పార్టీ ఏర్పాటు.. తమ పార్టీని ప్రజలు ఓన్ చేసుకోవడం.. ప్రజల కోణంలో ఎలా పనిచేయాలనే అంశంతో పాటు వివిధ అంశాలపై ప్రశాంత్ కిశోర్‌తో కవిత సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ఇక పార్టీ విధానాల రూపకల్పన కోసం ఇప్పటికే 50 కమిటీలతో కవిత అధ్యయనం చేయిస్తున్న

సంగతి తెలిసిందే. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ పరిరక్షణ కోసం పార్టీ ఏర్పాటు ప్రయత్నాల్లో కవిత వేగం పెంచిన విషయం విదితమే. ఇప్పటికే ప్రజల్లోకి వెళుతూ బిఆర్‌ఎస్‌ను దునుమాడుతున్నారు.

తండ్రి కెసిఆర్ పాలనపై విమర్శలు గుప్పిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పైనా విమర్శలు చేస్తున్నారు.

ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలు కవిత క్రియాశీలక పాత్ర పోషించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. అదే సమయంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నాటి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా కవిత గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో అంటే.. 2019లో అదే స్థానం నుంచి మళ్లీ బరిలో దిగి.. బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ చేతిలో ఆమె ఓటమి పాలయ్యారు. టీఆర్ఎస్ తరఫున కవితను శాసనమండలికి ఆ పార్టీ అధినేత కేసీఆర్ పంపారు. ఆ తర్వాత చోటు చేసుకున్న



పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా కవిత ప్రజల్లోకి వెళ్లారు. జనం బాట పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ.. ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలపై ప్రభుత్వాన్ని ఆమె నిలదీస్తున్న విషయం విదితమే. సొంత పార్టీ స్థాపించడం ద్వారా.. రానున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రముఖ రాజకీయ పార్టీలకు బలమైన పోటీగా నిలవాలని కవిత భావిస్తున్నారు. అందుకోసం ఆ దిశగా అడుగులు వేస్తున్నారామె. ఈ నేపథ్యంలో ఇలా ప్రశాంత్ కిశోర్‌తో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు.

గతంలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ తెలంగాణలో ముచ్చటగా మూడోసారి అధికారం చేపట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావించారు. అప్పట్లో ప్రశాంత్ కిశోర్‌తో కేసీఆర్ పలుమార్లు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. కానీ ఆ ఎన్నికల్లో తెలంగాణ ఓటర్లు.. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన సంగతి తెలిసిందే. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో మళ్ళీ బిఆర్‌ఎస్‌కు అధఃకారం కల్ల అని తెలిసిపోయింది. దీంతో పార్టీ నుంచి బయటకు వచ్చిన కవిత సొంత ఎజెండతా రాజకీయాలు సాగిస్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు లక్ష్యంగా పోరాటం చేస్తున్నారు.

## భయపెడతున్న వెండి ధరలు

### రోజురోజుకూ గరిష్ట ధరలు నమోదు

ముంబై,(వార్త వేదిక సూర్య):వెండి ధరలు దూసుకెళుతున్నాయి. పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షిస్తూ ఈ తెల్లని లోహం సరికొత్త రికార్డులను తాకుతోంది. ఈ జనవరి నెలలోనే ఇప్పటివరకు 22 శాతం మేర వెండి ధర పెరిగింది. ప్రధాన పెట్టుబడి సాధనాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3 లక్షల మైలురాయికి అత్యంత చేరువలో ఉంది. గత శుక్రవారం ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ. 2,87,762 వద్ద ముగిసింది. గత ఏడాది ఏప్రిల్ లో రూ. 95,917గా ఉన్న ధర, అప్పటి నుంచి దాదాపు 200 శాతం పెరగడం గమనార్హం. సాధారణంగా మల్టీబ్యాగర్ స్టాక్స్ లో కనిపించే ఈ తరహా రాబడి, కమోడిటీలో నమోదు కావడం విశేషం. గత వారమే కిలో వెండి రూ. 2,92,960 వద్ద సరికొత్త రికార్డును సృష్టించింది. తాజాగా వెండి ధరలు కిలోకు మూడు లఖోల మార్క్ దాటి 3.18 లక్షల వద్ద




కొనసాగుతోంది. రోజురోజుకూ వేలల్లో ధరలు పెరగడం చూస్తున్నాం. వెండి ధరకు ఇంతటి డిమాండ్ రావడానికి పలు అంతర్జాతీయ అంశాలు దోహదం చేస్తున్నాయి. గత మూడేళ్లుగా పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేసిన ప్రపంచ కేంద్ర బ్యాంకులు, ఇప్పుడు తమ నిల్వల్లోకి వెండిని కూడా చేర్చుకుంటున్నట్లు వస్తున్న నివేదికలు ధరలకు మరింత ఊతమిస్తున్నాయి.

## మరోసారి వార్తల్లో సత్యం కంప్యూటర్స్ స్కామ్

(మొదటి పేజీ తరువాయి)

చర్చకు దారి తీసింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో ఈ భూముల కొనుగోలు పెద్ద సంచలనం సృష్టించింది.సత్యం కంప్యూటర్ స్కామ్‌లో జన్వాడ భూములపై నాంపల్లి ప్రత్యేక కోర్టు సోమవారం విచారణ చేపట్టింది. జన్వాడ ల్యాండ్ కేసులో సత్యం రాజు, నందిని రాజు, తేజ రాజులతో పాటు 213 మందికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.

ఈ వ్యవహారంలో ఈడీ అధికారులు కౌంటర్ దాఖలు చేయాలని నాంపల్లి ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఈ కేసులో తాజాగా.. అభినవ్ అనే వ్యక్తి కీలకంగా మారాడు. జన్వాడ భూముల వ్యవహారంపై తనకు తెలిసిన విషయాలను కోర్టు ముందు వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నానంటూ అభినవ్ నాంపల్లి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. తాను ఈ స్కామ్‌లో జరిగిన అసలు విషయాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నానని, సాక్షిగా వాంగ్మూలం ఇవ్వడానికి అవకాశం ఇవ్వాలని కోరాడు. ఈ నేపథ్యంలో ఈ కేసును మరింత సమగ్రంగా తీసుకెళ్లే అవకాశముందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అభినవ్ వాంగ్మూలం కొత్త ఆధారాలను బయటపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటివరకు తెలియని బినామీ లావాదేవీల వివరాలు, రాజకీయ, వ్యాపార సంబంధాల వంటి కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. కోర్టు ఆయనను సాక్షిగా అనుమతిస్తే, కేసు దిశ పూర్తిగా మారే అవకాశం ఉంది. జన్వాడ భూముల కేసును ఈడీ అధికారులు సీరియస్‌గా తీసుకుని విచారణ చేస్తున్నారు. సత్యం రాజు(రామలింగ రాజు), నందిని రాజు, తేజ రాజుతో పాటు మొత్తం 213 మందికి నాంపల్లి ప్రత్యేక కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుల ద్వారా అక్రమ ఆస్తుల వివరాలు, భూముల కొనుగోలు విధానం, నిధులు తదితర అంశాలపై వివరణ ఇవ్వాలని ఈడీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సత్యం కంప్యూటర్స్ స్కామ్‌పై గతంలో సీబీఐ విస్తృతంగా విచారణ చేసింది. ఆ విచారణలో నిధుల దారి మళ్లింపు, తదితర అంశాలు బయటపడ్డాయి. అయితే.. అప్పట్లో భూముల కొనుగోలు అంశం పూర్తిస్థాయిలో వెలుగులోకి రాలేదని ఈడీ అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ పరిసరాల్లో వందల ఎకరాల భూములు ఈడీ విచారణలో అత్యంత కీలకంగా మారాయి. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా భూములు కొనుగోలు చేసినట్లు ఆధారాలు లభించినట్లు సమాచారం. ఈ భూముల విలువ ప్రస్తుతం.. వేల కోట్ల రూపాయలకు చేరినట్లు ఈడీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ అంశంపై 2014లో ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. సత్యం స్కామ్ ద్వారా అక్రమంగా సంపాదించిన డబ్బును రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టడం, బినామీ పేర్లతో భూములు కొనుగోలు చేయడం షెల్ కంపెనీల ద్వారా లావాదేవీలు నిర్వహించడం వంటి అంశాలపై ఈడీ కేసు నమోదు చేసింది. ఇప్పుడు అదే కేసులో భాగంగా జన్వాడ భూ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది.






## ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్‌లో బహుమతులు ప్రధానం

రామన్నపేట, జనవరి 19(వార్త వేదిక సూర్య):
నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం సహకారంతో నిర్వహించిన నూతన సంవత్సర & సంక్రాంతి శుభాకాంక్షలతో గరిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామన్నపేట ప్రీమియర్ లీగ్ సీజన్ -4 క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ , బహుమతులు రామన్నపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ చేతులు మీదుగా ఇచ్చారు. ప్రథమ బహుమతి 25000./,ద్వితీయ బహుమతి 15000/. రూపాయలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు జెల్ల వెంకటేశం, గొలుసుల ప్రసాద్, గండికోట ప్రతాప్, మహమ్మద్ అజార్, మరియు, క్రీడాకారులు, వెంకటేష్, నరేష్, మజీద్, బాలు, మిట్టు, విష్ణు, నవీన్, వంశీ, శివ, బాలాజీ, ఆరిఫ్, చింటూ, ప్రవీణ్, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తితో దేశ అభివృద్ధికి కృషి: మహేష్

రామన్నపేట, జనవరి 19(వార్త వేదిక సూర్య):
భారత రాజ్యాంగ స్ఫూర్తితో దేశ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ వెల్లంకి గ్రామ శాఖ అధ్యక్షుడు నకేరకంటి మహేష్ అన్నారు. గ్రామ అధ్యక్షుడిగా



నియమితులైన వేళ గ్రామంలో డా. BR.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనను కుల పెద్దలు అభినందించారు. డా.అశోక్, మాజీ సర్పంచ్ వెంకట్ రావు, శ్రీను, ఎర్రోళ్ల నరసింహ, జుంపాల మల్లేష్, తలారి నరసింహ, రాజు, కిరణ్, సురేష్, లింగయ్య, యాదయ్య ఉన్నారు.

## మోత్కూరును కమ్మేసిన పొగ మంచు..

**వాహన దారులు ఇబ్బందులు**



మోత్కూరు, జనవరి 19 (వార్త వేదిక సూర్య):
మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున 5గంటల నుంచి దట్టమైన పొగమంచు ఉదయం 9 గంటల దాకా చుట్టేసింది. మోత్కూరుబిబి తిరుమలగిరి ప్రధాన రహదారిపై రోడ్డు సరిగ్గా కనిపించక పోవడంతో వాహన దారులు త్రీవ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పొగ మంచుతో ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు ,ఆర్టీసీ బస్సులు లైట్లు వేసుకుని నెమ్మదిగా ప్రయాణించారు. పొగ మంచు దృష్ట్యా ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని వేగ నియంత్రణను పాటించాలని వాతావరణ శాఖ అధికారులు వాహనా దారులకు సూచిస్తున్నారు.


## సిపిఎం పార్టీకి చంద్రారెడ్డి రాజీనామా!



మోత్కూరు, జనవరి 19(వార్త వేదిక సూర్య):
మండలంలోని రాగిబావి గ్రామానికి చెందిన సిపిఎం మండల కమిటీ సభ్యులు పసునూరి చంద్రారెడ్డి సోమవారం నాడు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తాను 30 ఏళ్లుగా సిపిఎం పార్టీలో క్రమశిక్షణ సైనికునిగా, చురుకుగా పని చేసినట్లు తెలిపారు ఇటీవల రాగిబావి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా తన సతీమణి సంధ్య పోటీ చేస్తే ఈ ఎన్నికల్లో తమకు సహకరించ కుండా సీపీఎం మండల భారత రాష్ట్ర సమితి పార్టీకి మద్దతు తెలిపిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి మహ్మద్ జహంగీర్ దృష్టికి తీసుకుపోయిన స్పందించలేదన్నారు. పార్టీ నిర్మాణం కోసం ఎంతో కష్టపడ్డానని, అయినా ఫలితం లేదన్నారు. ఇక నుంచి సిపిఎం పార్టీతో తమకు ఏలాంటి సంబంధం లేదని తెలిపారు. సిపిఎం మండల కమిటీ సభ్యునిగా,ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు చంద్రారెడ్డి ప్రకటించారు.

## జాతీయస్థాయి షూటింగ్ బాల్ జిల్లా చెందిన విద్యార్థులు ఎంపిక

మోత్కూరు, జనవరి 19(వార్త వేదిక సూర్య):
వికారాబాద్ జిల్లాలోని తాండూరు మండలంలో సెయింట్ మార్క్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన 5వ సౌత్ జోన్ పోటీలో తెలంగాణ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18 న నిర్వహించిన యాదాద్రి జిల్లా నుండి పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ షూటింగ్ బాల్ అసలు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మోత్కూరు మానస, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోత్కూరు యాదయ్య సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. మోట కొండూర్ మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన జి భాను , సాయి గణేష్ , ఎం ఆసిస్ జాయ్, జూనియర్ విభాగంలో గెలుపొందగా వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన బి ఉదయ్ చరణ్ సబ్ జూనియర్ విభాగంలో గెలుపొందినట్లు వారు తెలిపారు. క్రీడల విభాగంలో చక్కటి క్రీడ నైపుణ్యాన్ని కనబర్చిన క్రీడాకారులను షూటింగ్ బాల్ అసోసియేషన్ సభ్యులు బి మహేష్, కే కృష్ణ, నవీన్ కుమార్ పలువురు అభినందించారు.





# ఐద్వా జాతీయ మహాసభల సందర్భంగా ఈనెల 25న హైదరాబాద్‌లో బహిరంగ సభకు మహిళలు వేలాదిగా తరలిరావాలి

**- ఐద్వా మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి పిలుపు**

మోటకొండూరు, జనవరి 19(వార్త వేదిక సూర్య):
ఈనెల 25 నుండి 28 వరకు హైదరాబాద్ నగరంలో జరుగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభల సందర్భంగా 25వ తేదీన నిర్వహించనున్న బహిరంగ సభలో మహిళలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని ఐద్వా మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి పిలుపునిచ్చారు. సోమవారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో ఐద్వా ఆల్ ఇండియా మహాసభల సందర్భంగా ఈనెల 25న హైదరాబాద్ లో నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ మహిళలతో కలిసి " పోస్టర్ " ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా నాగమణి పాల్గొని మాట్లాడుతూ బిజెపి మనువాద పాలనలో రోజురోజుకు మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతున్నాయని అన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులకు మద్యం, అశ్లీలత వంటి సామాజిక మాధ్యమాలే కారణమని పేర్కొన్నారు. ప్రభుత్వాలు వీటిని నిరోధించడంలో విఫలమయ్యాయని ఇప్పటికైనా గట్టి చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఐద్వా పోరాటాల ఫలితంగా మహిళలకు అనేక చట్టాలు, హక్కులు లభించాయని తెలిపారు. అయినప్పటికీ నేరాలు తగ్గకపోవడం తీవ్రమైన ఆందోళనకర విషయని వ్యాఖ్యానించారు. గృహ హింస చట్టం, ఆస్తి హక్కు చట్టం, మహిళలకు రిజర్వేషన్లు ఇవన్నీ ఐద్వా ఉద్యమాల ఫలితమేనని



తెలిపారు. కానీ కేంద్రంలోని బిజెపి నేటికీ 33% మహిళా రిజర్వేషన్ చట్టం అమలులో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళల అభ్యున్నతి కోసం భవిష్యత్ ఉద్యమాల కోసం నిర్వహిస్తున్న జాతీయ మహాసభల సందర్భంగా 25న జరగనున్న బహిరంగ సభకు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని నాగమణి కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు బొల్లేపల్లి లీల, ఎదునూరి కళ్యాణి, నోముల జ్యోతి, ఆకుల హేమలత, యండి. నజీమా, బొల్లేపల్లి శ్రీలత, నారగోని సంజన, దేవరపల్లి లక్ష్మి , వంజరి వనజ , కొత్తపల్లి అనిత , గోగు నాగలక్ష్మి , నారగోని తులసమ్మ , కడమంచి లక్ష్మి , మానుపాటి సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు...

# మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు.. ఇందిరమ్మ చీరల పంపిణీ త్వరగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్లతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్**

యాదాద్రి భువనగిరి బ్యూరో, జనవరి 19(వార్త వేదిక సూర్య):
మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక పథకాల ద్వారా చేయూత అందించడం జరుగుతుందని, ఈ క్రమంలో వడ్డీ లేని రుణాల పథకంలో భాగంగా పట్టణ మహిళా సంఘాల సభ్యులకు రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క అన్నారు. సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సి ఈ ఓ దివ్య దేవరాజన్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, మెప్మా అధికారులు, బ్యాంకు అధికారులతో వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర





ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, అర్హులైన స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మహిళ సంఘాలలో సభ్యులుగా లేని వారిని రేషన్ కార్డు ఆధారంగా గుర్తించాలని, పంపిణీ కార్యక్రమంలో రద్దీ లేకుండా చూడాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి,మెప్మా అధికారి రమేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన నిరుపేద ఇళ్ళను ఆ జాబితా నుంచి తొలగించాలని తహశీల్దార్‌కు వినతి..

మోత్కూరు, జనవరి 19(వార్త వేదిక సూర్య):
మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా కాలనీ , ఇందిరానగర్, గాంధీనగర్,రాజన్న గూడెం,వడ్డెర కాలనీ , జామచెట్ల బావి, కొండాపురం గ్రామాల నిరుపేదల కుటుంబాలు సుమారు 70 ఏళ్ల నుంచి పట్టా భూమిలోనే 650 ఇండ్లు నిర్మించుకొని జీవిస్తున్నారని భాజపా పట్టణ అధ్యక్షురాలు చాలా మంజులా రెడ్డి తెలిపారు. ఈ 650 ఇళ్లను ఇటీవల రాష్ట్రప్రభుత్వం బ్లాక్ లిస్ట్ పెట్టిందని, తద్వారా ఆ ఇళ్లను ప్రజల అవసరాల కోసం క్రయ, విక్రయ లేకుండా చేసిందని ఆరోపించారు. నిరుపేద ఈ ఇండ్లను బ్లాక్ లిస్టులో పెట్టడాన్ని ప్రభుత్వం వెంటనే తొలగించి గతంలో మాదిరేగానే యధావిధిగా కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నాడు బాజపా పట్టణ శాఖ



ఆధ్వర్యంలో తహశీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఇండ్ల బ్లాక్ లిస్ట్ జాబితా పై అనేక కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా నిరుపేద ఇళ్ళ పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేనియెడల భాజపా పక్షాన ఆందోళన కార్యక్రమాలు త్రీవతరం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ రైల్వే బోర్డు సభ్యులు కొనతం నాగార్జున రెడ్డి, జిల్లా నాయకులు గౌరు శ్రీనివాస్ గుప్తా, పోచం సోమయ్య, ఎడ్ల రాము, పట్టణ ఉపాధ్యక్షులు కందుకూరి ప్రకాష్, ఆరే శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి అన్నెపు సత్యనారాయణ, చేకూరి మల్లేశం, ముత్తినేని తిరుమలేష్, తీగల శ్రీధర్ గౌడ్, బీసు మధు, వనం రేణుక, వంగాల శ్రీనివాస్, బద్ద మహేంద్రరెడ్డి , బసవ శివ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ విప్‌కి వినతిపత్రం అందజేత

**-కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ నాగుల సత్యనారాయణ యాదవ్**

ఆత్మకూరు (ఎం), జనవరి 19 (వార్త వేదిక సూర్య):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామం నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్ నాగుల సత్యనారాయణ యాదవ్ ఉప సర్పంచ్ మెట్టు లలిత వార్డు మెంబర్లు ఇంద్రాల అంజయ్య మక్తల మంగమ్మ ఇంద్రాల రేణుక ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామములో పలు అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామపంచాయతీ లెటర్ ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడం జరిగింది .దానిలో ప్రధానంగా 1. బిక్కేరువాగుపై హై లెవల్ వంతెన నిర్మాణం పారుపల్లి ఎక్స్ రోడ్డు వయా పోతిరెడ్డిపల్లి నుండి రహీంఖాన్ పేట వరకు బిటి రోడ్డు నిర్మాణము, 2.గ్రామపంచాయతీ నూతన భవనం,3.బిసి కమ్యూనిటీ భవనము,4.సిసి రోడ్ల నిర్మాణము అండర్






గ్రౌండ్ డ్రైనేజీ పనుల గురించి తెలియజేశారు. ఎమ్మెల్యే వీటిపై సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, ఎడమ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాగుల ఆనంద్ యాదవ్, జక్కు మల్లారెడ్డి, మెట్టు అంతిరెడ్డి, మంచోజు అమరేంద్ర, చారి, కడకంచి కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బలం ఉన్న చోట సిపిఐ పోటీ

**సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి**

మోత్కూరు, జనవరి 19(వార్త వేదిక సూర్య):
ప్రతినిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మున్సిపల్ ఎన్నికల్లో జిల్లాలో బలం ఉన్న చోట పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి తెలిపారు. సోమవారం నాడు మోత్కూరు మున్సిపల్ పరిధిలో ఉన్న సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దామోదర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మున్సిపాలిటీలలో డ్రైనేజీ విద్యుత్ దీపాలు, రోడ్లు, సమస్యలు ఉన్నాయని, ఆయా సమస్యలు పరిష్కారం కావాలంటే సిపిఐ బలపర్చిన అభ్యర్థులను ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ సమావేశానికి మండల సిపిఐ నాయకులు చాపల అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ మండల, పట్టణ కార్యదర్శులు అన్నెపు




వెంకట్, బోయిని ఉప్పలయ్య, బుజిలాపురం, కొండగడప గ్రామ కార్యదర్శులు చేతరాశి, సత్తయ్య తొంట తిరుపతయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మొగుళ్ల శేఖర్ రెడ్డి, చేనేత సహకార సంఘం జిల్లా కార్యదర్శి పోచం కన్నయ్య, బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షులు పెండెం వెంకటేశ్వర్లు, గీతా పనివార్ల సంఘం మండల అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్, రైతు సంఘం మండల అధ్యక్షులు మొగుళ్ల తిరుపతిరెడ్డి మండల సిపిఐ సీనియర్ నాయకులు తాడూరు లక్ష్మీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




# మహిళలను అన్ని రంగాలలో రాణించడమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే సామేల్

**మోత్కూరు, జనవరి 19(వార్త వేదిక సూర్య):** మహిళలను అన్ని రంగాలలో రాణించడమే ప్రభుత్వ ధ్యేయమని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. సోమవారం నాడు మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఎల్.ఎన్. గార్డెన్ లో మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను శ్రీనిధి క్రింద 10 కోట్ల 48 లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వారికి ఒక లక్ష రూపాయలు బాంక్యుల ద్వారా లోన్ ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హాయంలో బతుకమ్మల చీరల పేరిట మహిళలకు నాసిరకం చీరలను పంపిణీ చేసిందని నేడు ఇందిరమ్మ చీరలను సిరిసిల్ల నేత కార్మికుల చేత నాణ్యతతో కూడిన చీరలను రూపొందించమని, తద్వారా నేత కార్మికులకు ఉపాధి కల్పించినట్లయిందని పేర్కొన్నారు.గత చీరలకు ఎందుకు పనికి రాకుండా పోయాయని నాటి చీరలకు,నేటి చీరలకు ఎంతో వ్యత్యాసం ఉందని చెప్పారు. రెండేళ్ల క్రితం మోత్కూరు రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, తాను ఎమ్మెల్యే అయ్యాక నాణ్యతతో రోడ్లను నిర్మించానని మరో 15 కోట్ల రూపాయలతో మున్సిపల్ పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాలను సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించి మోత్కూరును సుందరీకరణ చేయడమే తనముందున్న లక్ష్యమన్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మితమైన మోత్కూరుబిబి గుండాల మధ్యలో ఉన్నట్టువంటి బిక్కేరు బ్రిడ్జిని అతి తొందరలోనే రెండు వరుసగా మార్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తానని, మోత్కూరు లో ఆర్టీసీ బస్ డిపో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తానన్నారు. మోత్కూరులో ఇందిరమ్మ ఇండ్లను మరి కొన్ని మంజూరు చేస్తానని ,ప్రభుత్వ మంజూరు చేసిన వడ్డీ లేని 65 లక్షల రూపాయలు మహిళా సంఘాలు ఉపయోగించుకొని ఆర్థికంగా ఎదగాలని సామేల్ కోరారు. రానున్న ఎన్నికల్లో మహిళల దీవెనలతో మోత్కూరు మున్సిపల్ పరిధిలో ఉన్న 12 వార్డులకు 12 గెలిపించాలని, అందుకు మహిళలే ముందు వరుసలో ఉండాలన్నారు. అనంతరం డి ఎం సి.రమేష్ బాబు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన అన్ని వర్గాల మహిళలకు ఇందిర శక్తి చీరలను అందిస్తున్నామన్నారు. మహిళ సంఘాలలో ఉండి ఎవరైనా ప్రమాదవశాత్తు ఆకాల మృతి చెందితే 10 లక్షలు రూపాయలను ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు గౌడ్, పబ్లిక్ హెల్త్ ఏ ఈ సురేష్, తహశీల్దార్ పి. జ్యోతి , ఎంపీడీవో బాలాజీ నాయక్, మున్సిపల్ కమీషనర్ కే సతీష్ కుమార్, మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్ మున్సిపల్ ఏ.ఈ. సురేష్,, సింగిల్ విండో మాజీ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉమారాణి ఆర్.పి. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**యస్.వీరయ్య సిఐటియు జాతీయ నాయకుడు పిలుపు**

**యాదాద్రి భువనగిరి బ్యూరో, జనవరి 19(వార్త వేదిక సూర్య):**
కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్ లను రద్దుచేయాలని, వి బి జి రామ్ జి చట్టాన్ని, విద్యుత్తు సవరణ చట్టాన్ని,విత్తన బిల్లును వెంటనే విరమించుకోవాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ జాతీయ నాయకులు,రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్ వీరయ్య గారు కార్మికులకు పిలుపునిచ్చారు.

సోమవారం రోజున కార్మిక,కర్షక ఐక్యత దినోత్సవం సందర్భంగా సీఐ టి యు, రైతు, వ్యకాస వర్గ సంఘాల అధ్వర్యంలో స్థానిక ప్రిన్స్ చౌరస్తా వద్ద సీఐ టి యు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించడం జరిగింది.

ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య గారు మాట్లాడుతూ మోడీ పుట్టక ముందు నుండే దేశ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నేడు మోడీ రద్దుచేసి కార్మికుల ఎనిమిది గంటలను పన్నెండు గంటలకు పెంచుతూ కార్పొరేట్ లకు ఉపయోగపడే అనేక విధానాలను పొందపర్చి కార్మికుల హక్కులను కాల రాస్తూ నాలుగు లేబర్ కోడ్ లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన నుండి నేటికి 16 లక్షల కోట్లు మాఫీ చేశారని కార్పొరేట్ ల భజన పరుడు మోడీ అనీ విమర్శించారు.

జాతీయ గ్రామీణ ఉపాధికి గతంలో కేంద్ర ప్రభుత్వం 90% నిధులు కేటాయించేదని నేడు దాన్ని 60% నికి కుదించి రాష్ట్రాల పైన 40% భారం వేసి ఉపాధి పథకం ఎత్తివేసి కుట్ర చేస్తుందని విమర్శించారు. గతంలో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకానికి పేరు మార్చి బిబిజి రాంజీ అనే పేరు మార్చి పథకాన్ని ఎత్తివేసి పుట్ట చేస్తున్నారని ఇది దేశ ప్రజానీకానికి తీవ్ర నష్టమని తెలియజేశారు.విద్యుత్ సవరణ బిల్లు చేశారని దీని వల్ల నేడు 200 యూనిట్లు లోపు కరెంట్ సబ్సిడీ పొందుతున్న రైతులకు, పేదలకు నష్టం జరుగుతుందని కార్పొరేట్ యాజమాన్యాలకు రేటు తగ్గుతుందని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విత్తన సవరణ చట్టాన్ని తీసుకొచ్చి రాష్ట్రంలో పండిన పంటకు గిట్టుబాటు ధర రాకుండా దిగుమతికి ప్రాధాన్యత కల్పిస్తూ ఇక్కడ





రైతులను దివాలా తీసే విధంగా చట్టం సవరణ చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మికుల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాపితంగా ఫిబ్రవరి 12 న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు, రైతులు,కూలీలు,ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ బహిరంగ సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరు మల్లేశం,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నరసింహ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరు బాలరాజు గౌడ్ పాల్గొని ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో సీఐ టి యు జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు, కోశాధికారి ఎండీ పాషా, జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ , నకిరేకంటి రాము, జిల్లా సహాయ కార్యదర్శులు తుర్కపల్లి సురేందర్,గొరిగే సోములు, పైళ్ల గణపతి రెడ్డి, పొట్ట యాదమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు సిరిపంగి స్వామి, గుంటో శ్రీనివాస్ చారి,తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బూరుగు కృష్ణా రెడ్డి ,జిల్లా సహాయ కార్యదర్శి కందాడి సత్తి రెడ్డి, దోడ యాదిరెడ్డి, తుమ్మల నర్సి రెడ్డి, ర్యాకల శ్రీశైలం, పొట్ట శ్రీను,ఆకుల ధర్మయ్య, దేశెట్టి సత్య నారాయణలు పాల్గొనగా ఎన్ పి ఆర్ డి జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్, డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి లావుడ్య రాజు, పి ఎన్ ఎమ్ జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, జిల్లా నాయకులు బిక్షపతి, శ్రీమాన్,ప్రవీణ్ మద్దతు తెలియజేసి పాల్గొన్నారు.






# భూమి ఆక్రమణకు గురి కాకుండా ప్రీ కాస్ట్ ఏర్పాటు

- ప్రికాస్ట్ గోడను కూల్చివేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి
- సిరిగిరిపూరం గ్రామపంచాయతీ పాలకవర్గం
- చెత్తా చేదారం లేకుండా గ్రామాన్ని పరిశుభ్రం చేయడానికి ఫ్రీ కాస్ట్ ఏర్పాటు
- గ్రామంలో ఎక్కడ భూకబ్జా జరగలేదు గ్రామ పాలకవర్గం తీర్మానం ప్రకారమే నిర్ణయం

**మహేశ్వరం, జనవరి 19(వార్త వేదిక సూర్య):**
మహేశ్వరం మండలం సిరిగిరి పురం గ్రామంలో ప్రికాస్ట్ గోడను కూల్చివేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సిరిగిరిపూరం గ్రామపంచాయతీ పాలకవర్గం మహేశ్వరం ఎమ్మార్వో ఎంపీడీవో, మహేశ్వరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మహేశ్వరం మండలం సిరిగిరి పురం గ్రామం చింతాబాయి కుంట సర్వే నెం 72 నుండి స్మశాన వాటికకు వెళ్ళే రోడ్డు ఆక్రమణకు గురికాకుండ ఫ్రీ కాస్ట్ ఏర్పాటు చేసి భూమి ఆక్రమణ గురికాకుండా



పాలకవర్గం నిర్ణయం మేరకు తీర్మానం చేసి ఫ్రీ కాస్ట్ ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు కావాలని స్మశాన వాటిక భూకబ్జా జరిగిందని లేనిపోని ఆరోపణలు



చేస్తున్నారని సర్పంచ్ అన్నారు.

నాటి గ్రామ పంచాయతీ, పాలకవర్గం సమావేశం నిర్వహించుకొని పాలకవర్గం నిర్ణయం మేరకు గ్రామ అభివృద్ధిలో భాగంగా గ్రామానికి నీరు అందించే బోర్ల వద్ద గల చెట్లు, చెత్త, గ్రామంలోని చింతలనికుంటలో నుండి స్మశాన వాటిక వరకు గల రోడ్డు వైపుల చెట్లు తొలగించి, పరిసరాలను శుభ్రం చేసి ప్రీ కాస్ట్ గోడలను నిర్మాణంకు సంబంధించి గ్రామ-పంచాయతీ పాలకవర్గం తీర్మానించి పనులు చేపట్టడం జరిగింది. పూర్తి అయిన పనులను గ్రామానికి చెందిన వ్యక్తులు గండికోట శ్రీను తండ్రి లక్ష్మయ్య (లేట్), గండికోట పక్షరామ్ తండ్రి సత్తయ్య (లేట్), గండికోట యాదయ్య తండ్రి పద్మరావయ్య, గండికోట శ్రీకాంత్ తండ్రి వెంకటయ్య ఇంకా మరి కొందరు రాత్రి సమయంలో అనగా అదివారం నాడు విచ్చలవిడిగా అట్టి నిర్మాణం కూల్చి రాయడం జరిగింది. కావున తగు విచారణ జరిపి బాధ్యుల అందరిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటూ ఇక్కడ జరగబోయే పనులకు ఆటంకం కల్గకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.






# గణతంత్ర దినోత్సవ వేడుకలలో అంబేద్కర్ చిత్రపటం తప్పనిసరి

**-మాల మహానాడు ఆధ్వర్యంలో**
**అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) భాస్కరరావుకు వినతి పత్రం అందజేత**

**వలిగొండ,జనవరి 19(వార్త వేదిక సూర్య):**
ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలో రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటం పెట్టాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి, వలిగొండ మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) భాస్కరరావు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామం నుండి జిల్లా వరకు గవర్నమెంట్ ఆఫీసులలో, ప్రైవేట్ ఆఫీసులలో, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో అంబేద్కర్ చిత్రపటం ఉండేలా సూచించాలని అడిషనల్ కలెక్టర్ ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాశమల్ల శేఖర్, సహాయ కార్యదర్శి కట్ట సురేష్, సంస్కృతిక కార్యదర్శి కూచిమల్ల కుమార్, వెలువర్తి గ్రామ అధ్యక్షులు కూచిమల్ల నాగేంద్ర ప్రసాద్, సీనియర్ నాయకులు వలమల్ల రత్నయ్య, జక్క స్వామి, మద్దెల వెంకటేశం, బెల్లపు కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల అన్యాయంపై నల్ల బ్యాడ్జీలతో నిరసన...

**మోత్కూరు, జనవరి 19(వార్త వేదిక సూర్య):**
బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడంపై రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు మోత్కూరులో బీసీ జేఏసీ నాయకులు స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన చేశారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో



బీసీలకు 42% కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం అనేక మాయమాటలు చెప్పి నేడు స్థానిక ఎన్నికల్లో 34 శాతమే కల్పించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత చూపడంతోపాటు, జనరల్ స్థానాలలో బీసీలు పోటీ చేసి సత్తా చాటుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ జేఏసీ నాయకులు కలిమెల నర్సయ్య, జంగ శ్రీను పోచం సోమయ్య ,బయ్యని పిచ్చయ్య ఎడ్ల నరేష్ ,పోన్నెబోయిన రమేష్, గజ్జి మల్లేష్ , ముత్తినేని తిరుమలేష్ , అన్నందాసు విద్యాసాగర్ మొరిగాల శ్రీను అన్నెపు సత్యనారాయణ, బత్తిని ప్రభాకర్, బిరుదు శ్రీనివాస్, బుర్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్దే ధ్యేయంగా నిరంతరం కృషి : సామేల్

**మోత్కూరు, జనవరి 19(వార్త వేదిక సూర్య):**
మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్ధికై నిరంతరం కృషి చేస్తానని తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ అన్నారు. సోమవారం నాడు మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు మంజూరైన 15 కోట్ల రూపాయలతో స్థానిక గాంధీనగర్, ఇందిరా నగర్ కాలనీ, డ్రైవర్ కాలనీ, పద్మశాలి కాలనీ , అంగడి బజార్ లలో సీసీ, మున్సిపల్ పరిధిలోని జటంగిబావి లో బీటీ రోడ్ల నిర్మాణాలకు ఆయన శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ లో ఉన్న అన్ని కాలనీలలో సీసీ రోడ్లను వేసి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామన్నారు. ఈ కార్యక్ర



మంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల,వెంకటేశ్వర్లు గౌడ్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రుగౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, జిల్లా నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహ్మా రెడ్డి , అవిశెట్టి ఆవిలిమల్లు, మాజీ ఎంపీటీసీలు ముద్దం జయశ్రీ, కురిమిళ్ళ ప్రమీల , పట్టణ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు అన్నెపు పద్మ ,యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, స్థానిక నాయకులు బుంగపట్ల యాకయ్య, మెంట నగేష్, సుంకిశాల అనిల్, కళ్యాణ్ చక్రవర్తి, పల్లె బిక్షం, కూరెళ్ల శ్రీరాములు, వీర పెద్దులు తదితరులు పాల్గొన్నారు.






## శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆహ్వానం పత్రిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గుడిపల్లి సర్పంచ్కు గుడిపల్లి సర్పంచ్‌కి ఆహ్వానం

**దేవరకొండ, జనవరి 19(వార్త వేదిక సూర్య):** దేవరకొండ నియోజకవర్గం పీఏ పల్లీ మండలంలోని మేడారం గ్రామంలోశ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆహ్వానం త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గుడి చైర్మన్ వద్దిరెడ్డి వెంకటరెడ్డి మరియు మేడారం గ్రామ సర్పంచ్ గొంగడాల వెంకటయ్య మరియు రంగారెడ్డిగూడెం సర్పంచ్ ఎలుగూరి జయమ్మ భాస్కర్ రెడ్డి మరియు ఆలయ కమిటీ వైస్ చైర్మన్ నక్క సైదయ్య గార్లు సోమవారం రోజున గుడిపల్లి గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి కి ఆహ్వాన పత్రిక అందించి కుటుంబ సమేతంగా దైవదర్శనం చేసుకోవాల్సిందిగా కోరడం జరిగింది.

## ఘనంగా కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ వర్ధంతి

**దేవరకొండ, జనవరి 19(వార్త వేదిక సూర్య):** సోమవారం నాడు అమరజీవి కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ 24వ వర్ధంతి సందర్భంగా వారి స్మారక స్తూపం వద్ద ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ సమితి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ అన్న స్మారక



స్తూపం వద్ద వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం వారు మాట్లాడటం జరిగింది

ఈ కార్యక్రమం ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సూరిగి వినయ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎసచవతీతీచఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి అర్జున్, డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్, జిల్లా నాయకులు బాసవాడ శైలజ, ఎర్ర వినయ్, వివిధ మండల సమితి నాయకులు, కళాశాలల అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము భాను,ఏ సంతోష్,ఎలిమినేటి పుష్పలత,వి మణికంఠ,డి శివ,కే రామ్,ఎన్ వంశీ, చరణ్ తేజ్,కే బన్నీ,పి శ్రీకాంత్,సిద్దు, చరణ్, యస్వంత్,కే ధనలక్ష్మి,టీ పప్పీ,మల్లేష్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వద్యా రమేష్ నాయక్‌ను సన్మానించిన అదిమల్ల సాయి కుమార్ కుటుంబ సభ్యులు

**దేవరకొండ, జనవరి 19(వార్త వేదిక సూర్య):**

చింతపల్లి పట్టణ కేంద్రానికి ఎస్సీ కాలనీ చెందిన అధిమల్ల సైదులు కుమారుడి అదిమల్ల సాయి రెండు కంటి చూపులు ఆపరేషన్‌కు సహకరించేందుకు వారి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్ళినా బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్యా రమేష్ నాయక్ వారి కుటుంబ సభ్యులు శాలువాతో సత్కరించారు. కంటి చూపు ఆపరేషన్ ద్వారా అదిమల్ల సాయి కుమార్ కు చూపు



రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్ల శంకర్. అశోక్. ఉప్పల యాదయ్య. కాలేదు. నర్సింహ. భాస్కర శర్మ. మసారీ పెద్దయ్య. కృష్ణయ్య. నల్లబెల్లి లాలైయ్య నాగేటి వెంకటేష్మధు. విష్ణు భాస్కర, స్వామి. సిద్ది స్వామి, జ్ఞానేస్. తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవా ఆహ్వానం

### పాల్గొననున్న కేతావత్ భిల్యా నాయక్

**దేవరకొండ, జనవరి 19(వార్త వేదిక సూర్య):** చింతపల్లి మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలోఈ నెల 23 వతేది నుండి 25 వరకు జరిగే శ్రీ శ్రీ శ్రీ చెన్నకేశవస్వామి రథసప్తమి, బ్రహ్మోత్సవాల్లో పాల్గోనాలని గొల్లపల్లి గ్రామస్థులు ఈ



రోజు హైదరాబాదులోని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ నివాసంలో ఆహ్వాన పత్రికను అందించగా తమ ఆహ్వానం మేరకు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగే ఈ రథోత్సవం లో ఖచ్చితంగా పాల్గొంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రామచంద్రగూడ గ్రామంలో డ్రైనేజ్ సమస్యకు పరిష్కారం

- నాలుగో వార్డ్ లో ఉన్న డ్రైనేజ్ సమస్యను పరిష్కారం చేసిన రామచంద్రగూడ సర్పంచి దేవి తవుర్య నాయక్
- నాలుగో వార్డు సభ్యులు సుజాత రవి నాయక్

**మహేశ్వరం, జనవరి 19(వార్త వేదిక సూర్య):**
రామచంద్రగూడ గ్రామంలో డ్రైనేజ్ సమస్య లేకుండా కృషి చేస్తానని రామచంద్రగూడ సర్పంచి దేవి తవుర్య నాయక్ అన్నారు. మహేశ్వరం మండలం రామచంద్రగూడ గ్రామం నాలుగో వార్డులో డ్రైనేజ్ సమస్యతో గత కొన్ని సంవత్సరాలు ఇబ్బంది పడుతున్న పట్టించుకోలేదని ఇప్పుడు డ్రైనేజ్ సమస్య తీవ్రం కావడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంటనే డ్రైనేజ్ సమస్యను పరిష్కారం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా వాటర్ పోకుండా



డ్రైనేజ్ పేరుకుపోయి ఇబ్బందిగా మారిందని గ్రామ ప్రజలకు ఇబ్బందు లేకుండా ఎలాంటి సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తామని సర్పంచ్ తెలిపారు. నాలుగో వార్డ్ లో అండర్ డ్రైనేజ్ తో ప్రజలు ఇబ్బందు పడకూడదని వెంటనే సమస్యను పరిష్కారం చేయడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలు ఇబ్బందులు లేకుండా గ్రామ ప్రజా సంక్షేమ అభివృద్ధి చేయడమే లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు సభ్యులు సుజాత రవి నాయక్,సర్పంచ్ తనయుడు దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో మంచినీటి సమస్యకు పరిష్కారం

### - సర్పంచ్ మునగపాటి నవీన్

**మహేశ్వరం, జనవరి 19(వార్త వేదిక సూర్య):**

వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మహేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలోని 11వ వార్డులో తన సొంత నిధులతో నూతన బోరు వేయించిన మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్,ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నన్ను సర్పంచ్ గా గెలిపించిన మహేశ్వరం గ్రామ ప్రజల రుణం తీర్చుకోవడానికి గత కొన్ని రోజులుగా గ్రామంలో పర్యటిస్టిస్తున్నానని సమస్యల వివరాలు ప్రజలను అడిగి తెలుసుకుంటున్నానని గ్రామంలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తానని, అదే క్రమంలో 11 వ వార్డులో మంచి నీటి ఎద్దడిని గమనించానని ఈ సమస్యను అధిగమించడానికే బోరు వెయిస్తున్నా నాని మాట ఇచ్చాను ప్రకారం బోర్ వేయించడం జరిగింది. అదేవిదంగా గ్రామంలో పాలక వర్గంతో కలిసి 11,12,13 వార్డులు పర్యటించామని గ్రామంలో ఎక్కడ ఏ సమస్యలు ఉన్నా గ్రామ పంచాయతీ టోల్ ఫ్రీ నంబరు ్రాష్ట్ర.9000881020 కు ఫోన్ చేస్తే స్వల్ప వ్యవధిలో నే సమస్య పరిష్కరానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రోళ్ల చెంద్రయ్య ముదిరాజ్ , పోతర్ల అంబయ్య యాదవ్. సెక్రెటరీ సుజాత. ఉప సర్పంచ్ జొరల రమేష్.



వార్డు సభ్యులు టీంగిరికారి బేబీ మక్కజి. పోల్కం సునీత మహేందర్. అవులకాడి కిష్టమ్మ,స్వర్ణగంటి సంజీవ, కాడమోని స్వాతి ప్రభాకర్. వత్తుల షాలిని. గదగూటి శ్రీశైలం. కాకి పరమేష్, ఆకుల వీరబాబు. సున్నం స్వప్న కృష్ణ. రుకేశ్, అవులకాడి శ్రీశైలం. జాటవత్ హన్మంతు.గ్రామ శాఖ అధ్యక్షుడు డి కృష్ణా యాదవ్. సురేష్. శ్రీశైలం. హైమత్, ప్రభాకర్. రాజు. సిద్దు. శ్రీశైలం, మోతిలాల్.మహేశ్ బాబు బిఆరచవతీతీచస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

### - కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి

**మహేశ్వరం, జనవరి 19(వార్త వేదిక సూర్య):**
జిహెచ్ఎంసి, జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల సన్నద్ధత మీటింగ్ క్లస్టర్స్ వారీగా ప్రతీరోజూ సమావేశాలు కె ఎల్ ఆర్,మరో 3 ఏళ్ల పాటు గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీనే సాధ్యమని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, అన్నారు. తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో హస్తం పార్టీ ముఖ్య నాయకులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి డివిజన్లు, కందుకూరు, మహేశ్వరం మండలాల్లో ఎంపీటీసీ/ జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కావాలని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. డివిజన్లు, మండలాల వారీగా కో-ఆర్డినేటర్లను నియమించామన్నారు.

రెండ్రోజుల తర్వాత క్లస్టర్స్ వారీగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తామని పార్టీ సీనియర్స్ కు తెలిపారు.పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల విజయం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని. గీత దాటితే వేటు తప్పదని హెచ్చరించారు.

పార్టీ నాయకుల మధ్య సమన్వయం, అభ్యర్థుల విజయం



కోసమే కో- ఆర్డినేటర్లను నియమించినట్లు లక్ష్మారెడ్డి సూచించారు. జిహెచ్ఎంసీ డివిజన్లు, మండల రిజర్వేషన్ల ఖరారుపై సోషల్ మీడియాలో వస్తున్న ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దు అని కేఎల్ఆర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహేశ్వరం, కందుకూరు నాయకులు సహా డివిజన్ల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

### - అందెల శ్రీరాములు యాదవ్

**మహేశ్వరం, జనవరి 19(వార్త వేదిక సూర్య):**
మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల్ ముఖ్య నాయకుల సమావేశంలో దిశానిర్దేశం చేసిన జిల్లా ఎన్నికల కన్వీనర్, నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్, మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసీ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్ లో గల బడంగ్?పేట్, నాదర్గుల్, బాలాపూర్ డివిజన్లకు సంబంధించిన ముఖ్య నాయకుల సమావేశం నియోజకవర్గ బిజెపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు, మాట్లాడుతూ రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసీ) ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, పార్టీ గెలుపే



లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా తీసుకెళ్లాలని, బీజేపీ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ చేరవేయాలని తెలిపారు. గత పాలకుల వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలపై పోరాడుతూ.పార్టీకి బలంగా నిలవాలని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సమావేశాలు, కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్

### ఎల్.బి. నగర్ పోలీస్ స్టేషన్, మల్కాజ్గిరి కమిషనరేట్

**ఎల్ బి నగర్, జనవరి19(వార్త వేదిక సూర్య)**
ఆర్టీసీ బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసిన ఎల్.బి. నగర్ పోలీసులు నలుగురు నిందితుల నుండి, 60 గ్రాముల బంగారు గాజులను స్వాధీనం.

వివరాలు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను ఎల్.బి.నగర్ పోలీసులు విజయవంతంగా పట్టుకున్నారు. జనవరి 8, 2026 న శ్రీమతి కె. కృష్ణ నందిత అనే మహిళ ఎల్.బి. నగర్ ఎక్స్ రోడ్ వద్ద బస్సు ఎక్కుతుండగా, ఆమె బ్యాగులో ఉన్న 6 తులాల బంగారు గాజులను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నిందితుల వివరాలు

అరెస్టయిన నిందితులందరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నంద్యాల జిల్లా, ఆత్మకూరు మండలం, ముస్తపల్లి గ్రామానికి చెందినవారు:

1. ఎ1: తమ్మిశెట్టి వాణి ఏ చిట్టి (26 సంఎు) - పాత నేరస్థురాలు (తిరుపతి, నందికొట్కూరులో గతంలో కేసులు ఉన్నాయి).
2. ఎ2: గోగుల దానమ్మ (55 సంఎు) - 1987 నుండి పలు దొంగతనాల కేసుల్లో నిందితురాలు.
3. ఎ3: తమ్మిశెట్టి రాజు (32 సంఎు) - నిందితుడు.
4. ఎ 4: తమ్మిశెట్టి నాగమణి (26 సంఎు) - నిందితురాలు.

ఈ ముఠా అత్యంత చాకచక్యంగా దొంగతనాలకు పాల్పడేవారు: వీరు నెలకు రెండు మూడు సార్లు ఆంధ్రప్రదేశ్ నుండి



హైదరాబాద్‌కు వచ్చి, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సు రూట్లను ఎంచుకునేవారు.

ఎ1 మరియు ఎ2 బస్సు ఎక్కేటప్పుడు ఫుట్?బోర్డు వద్ద ప్రయాణికులను తోస్తూ, రద్దీని ఆసరాగా చేసుకుని మహిళల హ్యాండ్?బ్యాగుల జిప్పులు తీసి నగలను దొంగిలించేవారు.
ఎ3 మరియు ఎ4 నిఘా ఉంచడం మరియు దొంగిలించిన సొత్తును దాచిపెట్టడంలో సహాయపడేవారు.

రికవరీ మరియు ఇతర కేసులు

**స్వాధీనం చేసుకున్న సొత్తు:**

సుమారు రూ8,50,000 విలువైన 60 గ్రాముల (4) బంగారు గాజులు.

**ఇతర కేసులు:** విచారణలో నిందితులు అదే రోజు (జనవరి 8) వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బి.ఎన్. రెడ్డి నగర్ వద్ద మరో మహిళ నుండి 10 గ్రాముల బంగారు గొలుసు దొంగిలించినట్లు అంగీకరించారు.

**నిందితుల అరెస్ట్**

జనవరి 18, 2026 సాయంత్రం ఎల్.బి. నగర్ ఎక్స్ రోడ్ వద్ద కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించిన నిందితులను వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుండి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

**ప్రజలకు విజ్ఞప్తి**

ముఖ్యంగా మహిళా ప్రయాణికులు బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరుతున్నారు. మీ హ్యాండ్?బ్యాగులను భద్రంగా ముందు వైపు ఉంచుకోవాలని మరియు రద్దీగా ఉన్న ప్రాంతాల్లో అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలియజేయడం జరిగింది.






## శ్రీరామ కాలనీ రోడ్డు సమస్యలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు వినతి

**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 19 (వార్త వేదిక సూర్య):** శ్రీరామ కాలనీలో ఎదుర్కొంటున్న ప్రధాన రహదారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్ ని శ్రీరామ కాలనీ మాజీ కౌన్సిలర్ కెంచె లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధుబన్ కాలనీ నుండి శ్రీరామ కాలనీకి వచ్చే ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా సదరు రోడ్డును వెడల్పు చేయించాలని వారు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, సమస్య పరిష్కారానికి సానుకూలంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మైలార్?దేవ్?పల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాశీగారి యాదగిరి, ప్రేమ్ గౌడ్, చేనేత విభాగం అధ్యక్షుడు మసున రవికుమార్, శ్రీరామ కాలనీ సీనియర్ నాయకులు పసుపుల గోపాల్, అప్పం కృష్ణ, కట్కం శ్రీహరి పాల్గొన్నారు. అలాగే ఇందిరమ్మ కమిటీ మెంబర్లు కెంచె శ్రీకాంత్, సంపంగి నర్సింహ, నీలి రాజు, వీరేశం తదితరులు ఈ వినతి సమర్పించిన వారిలో ఉన్నారు.

## టియుటిఎఫ్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్తలూరి వెంకటేశ్వరావుకు జన్మదిన శుభాకాంక్షలు



**సికింద్రాబాద్, జనవరి 19 (వార్త వేదిక సూర్య):** తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టియుటిఎఫ్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా పురగిరి క్షత్రియ పెరికకుల సంఘం సోషల్ మీడియా కన్వీనర్ చిత్తలూరి వెంకటేశ్వరావు కు అల్లుడు మేకల మహేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేకల మహేష్ మాట్లా డుతూ... మరి ఇంకా ఎన్నో ఇలాంటి జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆ యొక్క భగవంతుని ఆశీస్సులు ఎల్లపుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## విద్యార్థుల ఉద్యమ ఫలితం ఫార్మసీ కాలేజీల ఏర్పాటు

### ఎంజియు బిఆర్‌ఎస్‌వి అధ్యక్షులు వాడపల్లి నవీన్

**నల్లగొండ,జనవరి 19 (వార్త వేదిక సూర్య):** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో నూతనంగా లా, ఫార్మసీ కాలేజీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన నేపథ్యంలో యూనివర్సిటీలో విద్యార్థులు సీట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజియు బిఆర్‌ఎస్‌వి అధ్యక్షులు వాడపల్లి నవీన్ మాట్లాడుతూ, ఇది పూర్తిగా విద్యార్థుల ఉద్యమాల ద్వారానే సాధ్యమైన చారిత్రక విజయం అని పేర్కొన్నారు. గత దశాబ్దాలుగా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో లా, ఫార్మసీ కాలేజీల కోసం విద్యార్థులు నిర్వహించిన ధర్నాలు, నిరసనలు, పోరాటాల ఫలితంగానే నేడు ఈ నిర్ణయం వచ్చిందని




తెలిపారు.విద్యార్థుల ఐక్యత, నిరంతర ఉద్యమ స్ఫూర్తి వల్లనే ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగి ఈ విజయం సాధ్యమైందని, ఇది యూనివర్సిటీ చరిత్రలో విద్యార్థి ఉద్యమాల గెలుపుగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శివ, మోహన్, శంకర్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

## సమ్మక్క- సారలమ్మ తల్లులను దర్శించుకొన్న ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**దేవరకొండ జనవరి 19(వార్త వేదిక సూర్య):** ములుగు జిల్లా మేడారంలో గిరిజన వనదేవతలు సమ్మక్క- సారలమ్మ తల్లులను రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ ఎ.రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రులు మరియు సహచర ఎమ్మెల్యేలతో కలిసి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవరకొండ నియోజక వర్గ ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను ప్రార్థించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అనంతరం మేడారంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు యువకులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలను వ్యతిరేకిస్తూ ప్రతి ఘటనతో తిప్పికొడదాం

### కార్మిక కర్షక ప్రజా హక్కులను కాపాడుకోవడానికి ఉద్యమిద్దాం

### వర్గ సంఘాల నాయకుల డిమాండ్




**నల్లగొండ,జనవరి 19 (వార్త వేదిక సూర్య):** దేశవ్యాప్తంగా సిఐటియు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల జాతీయ కమిటీల పిలుపుమేరకు నల్లగొండలో సిపిఎం ఆఫీసు నుండి గడియారం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి సభను నిర్వహించడం జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా విచ్చేసి సభను ఉద్దేశించి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. దేశ ఉత్పత్తిలో ప్రధాన భాగస్వామ్య రంగాలైన కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికుల హక్కుల పైన బిజెపి ప్రభుత్వం తీవ్రమైన దాడి చేస్తుందని వారు అన్నారు. మూడవసారి మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి కూటమి ప్రభుత్వం తన కార్పొరేట్ మతతత్వ విధానాలను వేగవంతం చేసింది, ప్రజల హక్కులను కాలరాయడమే కాక రాష్ట్రాల హక్కులను హరిస్తూ చట్టాలను తనకు అనుకూలంగా మార్చుకుంటూ కార్పోరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందని వారు అన్నారు. దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీ వంటి బడా పెట్టుబడుదారులకు కట్టబెడుతున్నదని ఆరోపించారు. అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడులను అమలు చేస్తూ, విద్యుత్ సవరణ చట్టం విత్తన బిల్లు వివిజి రాంజీ చట్టం భీమా రంగంలో 100% విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇవ్వటం అనురంగంలోనికి ప్రైవేటు కంపెనీలకు అనుమతిస్తూ అను చట్టం చేసింది వీటిని వ్యతిరేకిస్తూ సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో ఆందోళనలు చేస్తూ హక్కులను కాపాడుకోవడం కోసం మరోసారి ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు.

నూతన చట్టాల వలన రైతాంగం పంటలను తమ మద్దతు ధర చెల్లించకుండా మరోసారి రైతులు మోసం చేసే విధంగా మోడీ వ్యవహరిస్తున్నాడని అన్నారు. పత్తి కొనుగోలుకు కిసాన్ యాప్ ద్వారా ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తామని నిబంధన తీసుకువచ్చారు. జాతీయ విత్తన బిల్లును నూతనంగా తెచ్చింది ప్రపంచ వాణిజ్య సంస్థ షరతులతో దేశ వ్యవసాయ రంగం, విత్తన రంగం ఉత్పత్తి తగ్గింది, అయినప్పటికీ నేడు 32 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేయగా రెండు కోట్ల టన్నులను విదేశాలకు ఎగుమతి చేస్తున్నాం. విత్తనాలను ఉత్పత్తి చేసి 20 దేశాలకు ఎగుమతి చేస్తున్నాం నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేస్తున్న కంపెనీలను కాదని నేడు బహుళ జాతి సంస్థలకు వారికి అప్పజెప్పేందుకు నేడు మోడీ పని చేస్తున్నాడని అలాంటి విత్తన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం, ఉపాధి హామీ కింద పొందుతున్న గ్రామీణ కార్మికులు ఈ కొత్త చట్టం వల్ల ఉపాధి కోల్పోవడం జరుగుతుంది, మళ్లీ గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు పోవడానికి మోడీ విధానాలు ముందుకు వస్తున్నాయని దీనిని వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య, మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడులను వ్యతిరేకిస్తూ వికసిత్ భారత్ జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని వామపక్షాల పోరాట ఫలితంగా 2005 లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం 2005 లో రూపొందించారు. దీని ప్రకారం వ్యవ సాయ కార్మికులకు సంవత్సరంలో 100 రోజుల పని కల్పించాలని పాత చట్ట ప్రకారం 27 కోట్ల మందికి ఉపయోగపడుతుంది నూతన చట్టం ఇక రాష్ట్రాలు 40% కేంద్రం 60% నిధులు వెచ్చించాలని చట్టం చేశారు. దీనివలన రాష్ట్రాలు 40% నిధులను మ్యాచింగ్ గ్రాంట్ ను భరించలేని పరిస్థితులు వస్తాయి. దీనివలన పని దినాలు తగ్గనున్నాయని వారు అన్నారు.

దేశంలో శ్రామికులు సృష్టించిన సంపద ఖనిజాలను ప్రభుత్వంలోని తమ ఏజెంట్లు ద్వారా కార్పొ రేట్లకు కారు చౌకగా దోచిపెడుతున్నదని వారు తెలియజేశారు. శ్రమ శక్తి నీతి 2025 పేరుతో మోడీ ప్రభుత్వం కార్మిక విధానమును ముసాయిదాను ప్రకటించింది ఇప్పటికే 29 కార్మిక చట్టాలను రద్దు చేసింది. వాటి స్థానంలో ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్స్ విడుదల చేసింది. బ్రిటిష్ పాలనలో స్వాతంత్రానికి ముందు మొదట యజమానులకు మాత్రమే చట్టాలు ఉన్నాయి. ఆ సమయంలో కార్మికులు 16, 18 గంటల పనిని వ్యతిరేకిస్తూ కార్మికుల పోరాటాలు చేశారు. ఫలితంగా ఎనిమిది గంటల పని అమలు చేస్తూ నూతన చట్టం తెచ్చారు. భారత రాజ్యాంగంలో కార్మికశాఖ ఉమ్మడి జాబితాలో ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వాల అధికారా లను కూడా కేంద్రం గుంజుకుంటున్నది. ఫలితంగా ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నదని వారు అన్నారు. పనిచేయాలి ప్రశ్నించవద్దని నేటి విధాన పత్రంలో మోడీ తెలియజేస్తున్నారు.

సంపాదన సృష్టించటం, అభివృద్ధి చేయటం కార్మికుల పనిగా ఉన్నది. కానీ మోడీ యజమానులను దయాదాక్షిన్యాలతో అడుక్కోవాలి తప్ప, సమ్మెలు, పోరాటాలు చేసే హక్కును తొలగిస్తున్నామని వారు అంటున్నారు. దీని ఫలితంగా కార్మిక వర్గం సాధించినటువంటి చట్టాలు రద్దుచేసి మీరు యజమానులకు బానిసలుగా వివరించమని తెలియజేస్తున్నారు. సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ వీరపల్లి వెంకటేశ్వర్లు బొజ్జ చిన్న వెంకులు నా అధ్యక్షతన జరిగిన ఈ సభలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి,సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డబ్బికార్ మల్లేశ్, మహిళా రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద హాశం, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ, సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు బండ శ్రీశైలం, ఎండీ సలీం కంబాలపల్లి ఆనంద్ దండెంపల్లి సత్తయ్య, మల్లు గౌతమ్ రెడ్డి చింతపల్లి బయన్న పాదూరి శశిధర్ రెడ్డి,నలపరాజు సైదులు, భీమగాని గణేష్, రవి నాయక్, అవుట రవీందర్ మన్నెం బిక్షం, పోలె సత్యనారాయణ,మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా తయారీలో అక్రమాలు

### రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనపై బి.ఆర్.ఎస్ నేతల ఆందోళన



**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 19 (వార్త వేదిక సూర్య):** భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కు అని, ఆ హక్కు పరిరక్షణ కోసం ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా, విశ్వసనీయతతో, జవాబుదారీగా, చట్టబద్ధంగా జరగాలని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్య వ్యవస్థ అపహాస్యానికి గురవుతున్న దిశగా పరిణమిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం నార్సింగి మునిసిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పరిధిలో పనిచేయాల్సిన బూత్ లెవెల్ ఆఫీసర్ల బాధ్యతలను పక్కనపెట్టి, మండల రెవెన్యూ అధికారుల ఆధీనంలో అనధికార ఏజెంట్లు అధికారిక ఆన్?లైన్ ఆధారాలను యాక్సెస్ చేసి ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను నిర్వహిస్తున్నారని బి.ఆర్.ఎస్ నేతలు ఆరోపించారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమైన చర్య అని వారు పేర్కొన్నారు. ఆన్?లైన్ ద్వారా వచ్చిన ఓటర్ దరఖాస్తులు ఫీల్డ్ వెరిఫికేషన్ లేకుండానే తిరస్కరించబడుతున్నాయని, ఈ విషయమై పౌరులు సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్లను సంప్రదించి నప్పుడు, వారికి అలాంటి తిరస్కరణల గురించి ఎలాంటి సమాచారం లేదని చెప్పడం మరింత అనుమానాలకు తావిస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. అనధికార వ్యక్తులు రిమోట్ విధానంలో ఓటర్ల పేర్లు తొలగించడం ద్వారా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును హరించడం ప్రజాస్వామ్యంపై తీవ్రమైన దాడిగా బి.ఆర్.ఎస్ పార్టీ అభిప్రాయపడింది. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా, చట్టబద్ధమైన విధులను అవుట్ సోర్సింగ్ లేదా రిమోట్ కంట్రోల్ ద్వారా నిర్వహించడం చట్టపరంగా అనుమతించబడదని వారు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై భారత ఎన్నికల కమిషన్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సంస్థాగతంగా జవాబుదారీ వహించాలని డిమాండ్ చేశారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పూర్వ మణికొండ మునిసిపాలిటీ, ప్రస్తుత వార్డ్ నెంబర్ 127 మణికొండ మరియు వార్డ్ నెంబర్ 128 నెక్నాంపూర్ ప్రాంతాల్లో ఓటర్ల జాబితా తయారీలో తగిన విధివిధానాలు పాటించడం లేదని, రిమోట్-కంట్రోల్డ్ అనధికార ఏజెంట్లు ఈ ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారని బి.ఆర్.ఎస్ నేతలు ఆరోపించారు. ఈ వ్యవస్థను వెంటనే కూల్చివేయడం రాజ్యాంగ పరంగా అత్యవసరమని, లేనిపక్షంలో ప్రజాస్వామ్య ప్రక్రియే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో న్యాయ విచారణ చేపట్టి వ్యవస్థను సరిదిద్దాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్?కు బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, షేక్ ఆరిఫ్, సుమనళిని, జై రామ్, బొడ్డు శ్రీధర్, నూకల బిందు, దేవి ప్రియ, రఫీక్ వినతి పత్రం అందజేశారు.

# మీ సమస్య - మా బాధ్యత


### - నార్సింగి రోడ్డు పరిసరాల్లో బీఆర్ఎస్ ప్రజా కార్యక్రమం




**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 19 (వార్త వేదిక సూర్య):** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన "మీ సమస్య – మా బాధ్యత, ప్రజలతో – ప్రజలకోసం" కార్యక్రమంలో భాగంగా సోమవారం నార్సింగి రోడ్డు గీతాంజలి వేదిక, స్వస్తిక్ నగర్ పరిసర ప్రాంతాల్లో పార్టీ నాయకులు పర్యటించి స్థానిక ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు మార్పు కోరుతూ తమ పిల్లలకు నాణ్యమైన విద్య, కుటుంబాలకు ఆర్థిక భద్రత, వయోజనులకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించాలని కోరినట్లు స్థానిక పార్టీ అధ్యక్షుడు సీతారం ధూళిపాళ తెలిపారు.పొట్టకూటి కోసం కొంతమంది నవయువకులు కిరాణా తదితర సరుకుల సరఫరా సంస్థల్లో పనిచేస్తున్నారని, అయితే అనేక చోట్ల ఐదు అంతస్తుల కాంప్లెక్స్‌లలో లిఫ్ట్ వినియోగానికి అనుమతి ఇవ్వకపోవడంతో వారు మెట్ల మార్గంలో బరువైన వస్తువులు మోస్తూ తీవ్ర శ్రమ పడాల్సి వస్తోందని ప్రజలు వాపోయారు. ఈ పరిస్థితులపై స్పందించిన ఆ యువకుల తల్లిదండ్రులు, యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కేవలం కల్లబొల్లి మాటలతో కాలం గడుపుతోందని, కనీసం రేషన్ కార్డులు కూడా అందించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మరో వయోజనుడు మాట్లాడుతూ, పంచాయతీ సమితి ఉన్న కాలంలో తాను నిర్మించుకున్న 225 గజాల పెంకుటిల్లుకు ఇప్పటికీ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జత చేయలేదని సాకుతో జలమండలి అధికారులు నీటి సరఫరాకు మూడు రెట్లు పెనాలిటీ వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని గతంలోనే జలమండలి ఉన్నతాధికారులకు తెలియజేసినా స్పందన లేకుండా ఇలాంటి వసూళ్లు కొనసాగిస్తున్నారని విమర్శించారు.ఈ చర్యలతో ప్రజలను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులు హితవు పలికారు. లేనిపక్షంలో ప్రజల మద్దతుతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ పాదయాత్రలో కుంభగల్ల ధనరాజ్, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, షేక్ ఆరిఫ్, సుమనళిని, జై రామ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

### తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్



**నల్లగొండ, జనవరి 19 (వార్తా వేదిక సూర్య):** తెలంగాణ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బిఎఎస్)క్వాలిటీ స్కీమ్ కింద చదువుతున్న సుమారు 25,000 మంది ఎస్సి, ఎస్ టి విద్యార్థులు ఫీజు బకాయిల కారణంగా చదువుకు దూరమయ్యే ప్రమాదంలో ఉన్నారని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల వెల్ఫేర్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. 2008 లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా పేద ఎస్ సి, ఎస్ టి విద్యార్థులకు (మొదటి తరగతి నుండి పదవ తరగతి వరకు లేటరీ పద్ధతి ద్వారా) నాణ్యమైన ప్రైవేట్ విద్య అందించాలనే ఉద్దేశం ఉండేదని సంఘం గుర్తు చేసింది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ఫీజులు విడుదల చేయకపోవడంతో, స్కూల్ యాజమాన్యాలు "ఫీజులు చెల్లించనంత వరకు విద్య అందించలేము" అంటూ తల్లిదండ్రులకు స్పష్టం చేస్తున్నాయని పేర్కొంది.దీని వల్ల ఎలాంటి తప్పు తెలియని చిన్న వయస్సు గల ఎస్ సి, ఎస్ టి విద్యార్థులు తోటి విద్యార్థుల మధ్య అవమానం, వివక్షకు గురవుతున్నారని, ఇది రాజ్యాంగం హామీ ఇచ్చిన విద్య హక్కుకు విరుద్ధమని సంఘం తెలిపింది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి,ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్కలు ఈ విషయంపై తక్షణమే జోక్యం చేసుకుని, పెండింగ్?లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి ఎస్ సి, ఎస్ టి విద్యార్థులు నిర్భయంగా చదువు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ మీసాల సైదులు డిమాండ్ చేసారు.



## చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో కలిసివచ్చే లౌకిక శక్తులతో సిపిఎం పార్టీ పోటీ...

**కలిసొచ్చే లౌకిక పార్టీలతో మున్సిపల్ చైర్మన్ గెలుపు.**

**ఎండి పాషా, గోశిక కరుణాకర్, అవ్వారి రామేశ్వరి, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు**

**చౌటుప్పల్, జనవరి 19(వార్త వేదిక సూర్య):** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని, ప్రశ్నించే గొంతుకలకు, పట్టం కట్టాలని, కలిసొచ్చే లౌకిక శక్తులతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తామని, ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా పిలుపునిచ్చారు. సోమవారం రోజున స్థానిక సిపిఎం పార్టీ పట్టణ కార్యాలయం లో నిర్వహించిన సిపిఎం పార్టీ మున్సిపల్ కమిటీ కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సిపిఎం పార్టీ గా చౌటుప్పల్ మున్సిపాలిటీలో సర్పంచ్ గా ఎంపీటీసీలుగా గెలిచి అభివృద్ధి చేసినటువంటి పనులు మాత్రమే ఉన్నాయని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులు గెలిపిస్తే ప్రజా సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్లో పోరాటం చేస్తారని, వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పాలకవర్గంపై ఒత్తిడి తీసుకువచ్చి, వార్డుల అభివృద్ధికి కృషి చేస్తారని పేర్కొన్నారు. సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోషిక కరుణాకర్ మాట్లాడుతూ అవినీతి లేకుండా సుపరిపాలన అందిస్తామని తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో 20 వార్డుల్లో శాఖలు ఏర్పడి ఉన్నాయని, కలిసి వచ్చే లౌకిక శక్తులతో 20 వార్డుల్లో కలిసి పోటీ చేస్తామని, చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. గతంలో చౌటుప్పల్ లో వరదలు వచ్చి చెరువు, నీటితో చౌటుప్పల్ కొంత భాగం మునిగినప్పుడు ప్రజలకు అండదండగా ఉండి ప్రాణ, ఆస్తి ,నష్టాలు కలుగకుండా కాపాడిన చరిత్ర ప్రజాప్రతినిధులుగా మాకు దక్కిందని అన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారి రామేశ్వరి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గతంలో సిపిఎం సర్పంచ్ గా జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత అదేవిధంగా ఎన్నికైన కౌన్సిలర్లు నీతిగా, నిజాయితీగా, పాలన కొనసాగించారని గుర్తు చేశారు .మున్సిపల్ కార్యదర్శివర్గ సభ్యులు దండ అరుణ్ కుమార్, అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిఎంపిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు బండారు నరసింహ, సిపిఎం పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ గోపగోని లక్ష్మణ్, సిఐటియు నాయకులు బత్తుల దాసు, రైతు సంఘం నాయకులు ఆకుల ధర్మయ్య, ఉష్కాగుల శ్రీను, పాల్గొన్నారు.





## వడ్డీ లేని రుణాలు తీసుకొని సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి

**మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాంరెడ్డి**

**చౌటుప్పల్, జనవరి 19(వార్త వేదిక సూర్య):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులని చేయాలని సంకల్పంతో భాగంగా సోమవారం చౌటుప్పల్ పురపాలక సంఘం బి ఆర్ కె ఫంక్షన్ హాల్ చౌటుప్పల్ స్వయం సహాయక మహిళా సంఘాలచే సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి సమావేశంలో గత రెండు సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 591 మహిళ సంఘాలకు

రూ. 1,28,11,337/-(ఒక కోటి ఇరవై ఎనిమిది లక్షల పదకొండు వేల మూడు వందల ముప్పై ఏడు రూపాయలు) వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడంజరిగింది మరియు 451సంఘాలకు గాను రూపాయలు



33,25,00,000/(ముప్పై మూడు కోట్ల ఇరవై ఐదు లక్షల రూపాయలు) వివిధ పథకాల ద్వారా వివిధ బ్యాంకుల నుండి రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు.

మహిళలు ఋణాలు తీసుకొని స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కమీషనర్ తెలియ చేసారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులని చేయాలని సంకల్పం లో భాగంగా ఈరోజు చౌటుప్పల్ పురపాలక సంఘం బి ఆర్ కె ఫంక్షన్ హాల్ యందు చౌటుప్పల్ స్వయం సహాయక మహిళా సంఘాలచే సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి సమావేశంలో గత రెండు సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 591 మహిళ సంఘాలకు

రూ. 1,28,11,337/-(ఒక కోటి ఇరవై ఎనిమిది లక్షల పదకొండు వేల మూడు వందల ముప్పై ఏడు రూపాయలు) వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం జరిగింది మరియు 451సంఘాలకు గాను రూపాయలు

33,25,00,000/(ముప్పై మూడు కోట్ల ఇరవై ఐదు లక్షల రూపాయలు) వివిధ పథకాల ద్వారా వివిధ బ్యాంకుల నుండి రుణాలు మంజూరు చేయడం జరిగిందని, మహిళలు ఋణాలు తీసుకొని స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కమీషనర్ గారు తెలియ చేసారు.

ఇట్టి కార్యక్రమంలో అతిధులుగా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, డైరెక్టర్ నిరంజన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి మున్సిపల్ మేనేజర్, డి.అంజయ్య ఆర్వో. హనుమాన్ ప్రసాద్, సానిటరీ ఇన్స్పెక్టర్, కవిత పి ఎం సి,, ఆర్ పి లు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## రేవంత్?.. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు

**- తులసివనంలో గంజాయి.. కాంగ్రెస్ పార్టీకి అక్షరాల వర్తిస్తుంది**

**- పార్లమెంట్ సభ్యులు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ కె లక్ష్మణ్ ఆగ్రహం**

**హైదరాబాద్:** సిపిఐ జాతీయ మహాసభల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షా పై మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నాం. జాతీయ పార్టీ హోదా కోల్పోయి మనుగడ సాగిస్తున్న సిపిఐ జాతీయ మహాసభల్లో.. అస్తిత్వానికి సవాల్ గా మారుతున్న తరుణంలో వారి సభల్లో పాల్గొని కాంగ్రెస్ పార్టీ కూడా అతి త్వరలో అదే పరిస్థితి రానున్నది.

నేడు కాంగ్రెస్ పార్టీది అస్తిత్వ సవాల్ లాంటిది. అధికారం మాట అటు నుంచి మనుగడ సాగించడానికి ప్రయత్నించాల్సిన పరిస్థితి ఏర్పడ్డాయి.. తప్పుడు మాటలతో కుట్ర కుతంత్రాలతో అబద్ధాలతో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని పరిపాలిస్తున్న రేవంత్ రెడ్డికి, రానున్న పరిస్థితుల్లో అర్థమై ముఖ్యమంత్రి హోదాలో మాట్లాడకూడని మాటలు కూడా మాట్లాడుతూ చులకన అవుతున్నారు.

రాహుల్ గాంధీ మాట్లాడుతున్న విధానం, రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న విధానం దేశ ప్రజలలో వారికి రోజురోజుకు పతనమవుతున్న దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి..రేవంత్ రెడ్డి మాట్లాడిన తులసివనంలో గంజాయి అనే పదం కాంగ్రెస్ పార్టీకి అక్షరాల వర్తిస్తుంది.

ఇకనైనా మాట్లాడేటప్పుడు ప్రధానమంత్రి పై గౌరవంతో భారతీయ



జనతా పార్టీ అనేక రాష్ట్రాలలో అధికారంలో ఉన్న విషయాన్ని గ్రహించుకొని ప్రజల అసహ్యించుకునే విధంగా కాకుండా ఉన్న కాస్త కోల్పోకుండా చూసుకోవాలి. ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తున్నదనే విషయాన్ని ప్రపంచం గుర్తించింది. ప్రపంచంలో ఉన్న భారతీయులందరూ నరేంద్ర మోడీ ని ప్రధానమంత్రిగా ఉన్నందుకు గర్విస్తూ భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచం మొత్తం చాటుతున్నారు.

భారతదేశ ప్రజల కలలుగన్న నవ భారతదేశం నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రపంచంలోనే అగ్ర దేశంగా రూపొందుతుంది అన్న భావన లో సంకోచం లేదు. జరిగి తీరుతుంది అన్న వాస్తవాన్ని భారతదేశ ప్రజలు గుర్తిస్తున్నారు.

## దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్

**వినోద్ నాయక్ ఓయూ జనసేన రాష్ట్ర నాయకుడు**

**దేవరకొండ, జనవరి 19(వార్త వేదిక సూర్య):** దేవరకొండను వెంటనే జిల్లాగా ఏర్పాటు చేయాలని దేవరకొండ జిల్లా సాధన వినోద్ నాయక్ ఓయూ ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. దేవరకొండ ప్రాంతం భౌగోళికంగా విస్తీర్ణంగా ఉండటంతో పాటు 70 శాతం గిరిజన, రైతు, పేద ప్రజలు అధికంగా నివసిస్తున్న ప్రాంతమని ఆయన తెలిపారు. జిల్లా కేంద్రం దూరంగా ఉండటంతో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దేవరకొండను జిల్లాగా ప్రకటిస్తే పరిపాలన మరింత సులభమవుతుందని, ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు చేరుతాయని, విద్య, వైద్యం, ఉపాధి, ఉన్నత పోలీస్ శాఖ, అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. దేవరకొండ జిల్లా చేయడానికి దీనికి తక్కువేం కాదని 13 ,14 శతాబ్దాల రేచర్లలు పద్మనాయకులు పరిపాలించిన చరిత్ర గల దేవరకొండ ఖిల్లా చారిత్రకమైన చరిత్ర కలిగిన అద్భుతమైన కట్టడాలు ఉన్నాయని అప్పట్లో తెలుగు అకాడమీ అకాడమీ పుస్తకాల మీద ఉన్న పూర్ణకుంభం మా దేవరకొండ ప్రాంతం నుంచి కనుకున్నారని తెలియజేసుకుంటూ ప్రజల ఆకాంక్షలను గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దేవరకొండను జిల్లాగా ప్రకటించాలని ఆయన కోరారు.



# రేవంత్.. దమ్ముంటే సీబీఐ విచారణ కోరు

- **బొగ్గు అవినీతిపై అన్ని ఆధారాలు సమర్పిస్తా**
- **చీకటి ఒప్పందం లేకుంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని కిషన్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నాం**
- **రేవంత్ రెడ్డికి తెల్వకుండా సెట్ ఎలా వస్తుంది?**
- **రేవంత్ రెడ్డికి తెల్వకుండా సెట్ వస్తే ముఖ్యమంత్రిగా నువ్వు ఫెయిల్**
- **టీడీపీ నుంచి బయటకు వచ్చి నువ్వు ద్రోహం చేసావు**
- **సింగరేణి టెండర్ల విషయంలో సీఎం, భట్టి, కోమటి రెడ్డి మధ్య వాటాల పంచాయతీ కాదా?**
- **మధ్యలో ఐఏఎస్, జర్నలిస్టులు బలి పశువులు**
- **సైట్ విజిట్ విధానం శాశ్వతంగా రద్దు చేయాలి**
- **ఈ విధానం వచ్చాక మొదటి లబ్దిదారులు రేవంత్ బామ్మర్ది సుజన్ రెడ్డి**
- **ఆయన కంపెనీ శోదా కన్స్ట్రక్షన్ కే ఈ సర్టిఫికెట్ వచ్చాక, మొదటి టెండర్ దక్కింది**
- **నైనీ బ్లాక్‌లో వాటాల పంచాయతీ వచ్చి కొట్టుకునే పరిస్థితి**
- **కాంట్రాక్టు సైట్ విజిట్ పద్ధతి మన దేశంలో లేదు**
- **రేవంత్ ప్రభుత్వం వచ్చాక 2024లో సైట్ విజిట్ విధానం**
- **కోల్ ఇండియా, వెస్టన్ కోల్ బ్లాక్ లో లేని విధానం సింగరేణిలో ఎందుకు?**
- **నైనీ టెండర్లు మాత్రమే రద్దు చేస్తాం అన్నారు.. మరి మిగతా వాటి సంగతి ఏమిటి?**
- **కమీషన్ల కోసం సింగరేణి ఇచ్చే డీజిల్ విధానం రద్దు చేశారు**
- **డీజీపీ .. మీ ఖాకీ బుక్కు కాకి ఎత్తుకుపోయిందా?**
- **సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ ఫైర్?**

**హైదరాబాద్:** సింగరేణి టెండర్ల కుంభకోణం, సీఎం, మంత్రుల వాటాల పంచాయతీలు చూస్తున్నాం. మరికొన్ని దిమ్మదిరిగే విషయాలు బయట పెడుతున్నాం. కాంట్రాక్టు సైట్ విజిట్ పద్ధతి నైనీ బ్లాక్ లో పెట్టారు. అందువల్ల నైనీ బ్లాక్ టెండర్లు రద్దు చేస్తున్నాం అని భట్టి అన్నారు.

కాంట్రాక్టు సైట్ విజిట్ పద్ధతి మన రాష్ట్రంలో లేదు. దేశంలో లేదు. వెస్టన్ కోల్ ఫీల్డ్, కోల్ ఇండియాలో కూడా లేదు.. రేవంత్ ప్రభుత్వం వచ్చాక 2024లో సైట్ విజిట్ విధానం తెచ్చారు.. ఈ విధానం వచ్చాక మొదటి లబ్దిదారులు రేవంత్ బామ్మర్ది సుజన్ రెడ్డి. ఆయన కంపెనీ శోదా కన్స్ట్రక్షన్ కే ఈ సర్టిఫికెట్ వచ్చాక, మొదటి టెండర్ దక్కింది..

ఈ విధానం వచ్చాక సింగరేణిలో ఆరు టెండర్లు కూడా ప్లస్ 7 పర్సంటేజ్ కు టెండర్లు వారి అనుయాయకులకు కట్టబెట్టడం జరిగింది.. ఎనీ ఓబీ కోల్ బ్లాక్ టెండర్ మన దేశంలో ఎక్కడ జరిగినా మైనస్ 10 నుంచి మైనస్ 22 శాతానికి పోతుంది. గతంలో సింగరేణి మైనస్ 7, మైనస్ 8, మైనస్ 10, మైనస్ 20 పోతుండే. మైనస్ 10 టు మైనస్ 20 ఎక్కడైనా ఉంటుంది..

రేవంతు వచ్చాక కొత్త విధానం తెచ్చాక అన్ని టెండర్లు ప్లస్ 7 నుంచి



ప్లస్ 10 శాతానికి పోతున్నాయి.. భట్టి కేవలం నైనీ టెండర్లు మాత్రమే రద్దు చేస్తాం అన్నారు.. మరి మిగతా వాటి సంగతి ఏమిటి?ఆన్ లైన్ టెండర్ల ద్వారా దేశంలో ఎవరైనా వేయొచ్చు.

కానీ సైట్ విజిట్ విధానంలో ముందే వెళ్లి సైట్ విజిట్ చేసి సింగరేణి నుంచి సర్టిఫికేట్ తెచ్చుకోవాలి.. అంటే ఈ విధానంలో ఎవరు ముందుగానే టెండర్ వేస్తున్నారో తెలుసుకొని, బెదిరించి, భయపెట్టి వారికి టెండర్ దక్కకుండా చేసి, తమ అనుయాయులకు ప్లస్ 7 నుంచి ప్లస్ 20 శాతానికి కట్టబెట్టి, కమీషన్లు కొల్లగొట్టారు.. నైనీ బ్లాక్ లో ఇదే జరిగింది. వాటాల పంచాయతీ వచ్చి కొట్టుకునే పరిస్థితి వచ్చింది.. కోల్ ఇండియా, వెస్టన్ కోల్ బ్లాక్ లో లేని విధానం సింగరేణిలో ఎందుకు అనే దానిపై అనేక ఫిర్యాదులు వచ్చాయి.

రెండో కోణం ఏమిటంటే.. గతంలో ఇదే సింగరేణిలో బిఆరచవతీచస సమయంలో ఉన్న టెండర్లు రద్దు చేసి, వాటినే తమ అనుయాయులకు కట్టబెట్టారు. అప్పుడు కాంపిటీటివ్ విధానంలో ఇచ్చిన టెండర్లు రద్దు చేసి, ఇప్పుడు ప్లస్ 7 మీద టెండర్లు కట్టబెట్టారు. గతంలో వెంకటేషన్ కని అనే టెండర్ బీఆర్ఎస్ హయాంలో మైనస్ 7 ఉంటే, ఇప్పుడు ప్లస్ 7మీద రీ టెండర్ చేసి కట్టబెట్టారు.

ఎస్ఆర్పీ ఎసీ టూ శ్రీరాంపూర్ అనే మైనస్ 7 టెండర్ రద్దు చేసి, ప్లస్ 7లో అప్పగించారు. ఎస్ ఆర్ పీ ఓసీ టూ విస్తరణ 2025 టెండర్ మూడు సార్లు వాయిదా వేశారు. డీల్ సెట్ కాక. మళ్లీ వారి అనుయాయులకు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

మూడవ కోణం ఏమిటంటే... సింగరేణి గతంలో బల్క్ లో ఐఓసీఎల్ నుంచి సరఫరా చేసేవారు. కానీ పర్సెంటేజీల కోసం డీజిల్ ను కూడా కాంట్రాక్టర్లకు అప్పగించారు. కమీషన్ల కోసం సింగరేణి ఇచ్చే డీజిల్ విధానం రద్దు చేశారు.

### సింగరేణికి దీని వల్ల ఎక్కువ నష్టం.

చేసినపని మీదనే కాదు, డీజిల్ కలుపుకొని జీఎస్టీ కట్టాల్సి ఉంటుంది. సంస్థకు నష్టం కదా? ఇదంతా ముఖ్యమంత్రి దగ్గరి సన్నిహితులు, సమీప బంధువు కనుసంజ్ఞల్లో జరుగుతున్నది. ఎవరికి సర్టిఫికేట్ రావాలన్నా, టెండర్ రావాలన్నా వారి ఆదేశం లేనిదే దక్కదు.

చీటికి మాటికి సిట్ అంటున్నవు, నీకు నిజాయితీ ఉంటే దమ్ముంటే సీబీఐ విచారణకు అనుమతించు.అన్ని వివరాలు అందించేందుకు నేను సిద్దం.రేవంత్ రెడ్డి, బిజేపీ అక్రమ సంబంధం లేకుంటే, చీకటి ఒప్పందం లేకుంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని కిషన్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నాం. రెండేళ్ల నుంచి సింగరేణికి రెగ్యులర్ సీఎండీ లేదు. ఇంచార్జీని పెట్టి ఇలాంటి అడ్డగోలు వ్యవహారాలు చేస్తున్నారు.

భట్టి.. మీరు సైట్ విజిట్ సర్టిఫికేట్ లేదు అన్ని నైనీ రద్దు చేశారు కదా. అన్ని టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. సైట్ విజిట్ విధానం శాశ్వతంగా రద్దు చేయాలని, డీజిల్ విధానం రద్దు చేయాలని, సింగరేణికి సీనియర్ అర్హత కలిగిన సీఎండీని పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. క్యాబినెట్ దండుపాళ్యం ముఠా అంటే నా మీద పడ్డారు.. సింగరేణి టెండర్ల విషయంలో సీఎం, భట్టి, కోమటి రెడ్డి మధ్య వాటాల పంచాయతీ కాదా?

మధ్యలో ఐఏఎస్, జర్నలిస్టులు బలి పశువులు అయ్యారు. తన్నుకు చచ్చింది నిజం, వాటాల కోసం కొట్టుకున్నది నిజం. ఇందులో జర్నలిస్టులు, ఐఏఎస్ లో ఏం పాపం చేశారు? .

గతంలో దక్కన్ సిమెంట్స్ యజమానిని సీఎం ఇంటికి ఎదురుగా గెస్ట్ హౌజ్ లో తుపాకీ ఎక్కుపెట్టి పైసలు వసూలు చేశారని మంత్రి కుమార్తె చెప్పింది. సీఎం అత్యంత సన్నిహితుడు రోహిన్ రెడ్డి అని కూడా చెప్పారు. వ్యాపారవేత్తల వద్ద బెదిరించి సంపాదించుకున్న డబ్బులో, పంచుకోవడంలో వాటాల పంచాయతీ.

సమ్మక్క సారక్క టెండర్లు దక్కలేదని పొంగులేటి , టెండర్లు దేవాదాయ శాఖ నుంచి ఆర్ అండ్ బికి మార్చి టెండర్లు దక్కించుకున్నరు.

హోలో గ్రాం టెండర్ల విషయంలో ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రి మధ్య ఐఏఎస్ బలి అయ్యాడు. కోమటి రెడ్డిని చూసినం.. సంతకం పెట్టకముందే సినిమా జీవోలు వస్తున్నయ్యని అన్నడు.. సినిమా రేట్ల విషయంలో ముఖ్యమంత్రి వర్సెస్ కోమటి రెడ్డి. ఇన్ని పంచాయతీలు, మంత్రుల పంచాయతీలు.

ఆరు గ్యారెంటీలు అటకెక్కినయి, వాటాలా పంచాయతీలు ముందుకు వచ్చినయి.. కాంగ్రెస్ నాయకులు సంపత్ కుమార్ 8 కోట్ల కోసం కాంట్రాక్టర్ నే బెదిరించాడు.. కాంట్రాక్టరే స్వయంగా పోలీసు డిపార్ట్మెంట్ కి కంప్లైంట్ ఇచ్చిండు.. బీఆర్ఎస్‌ను, జర్నలిస్టులను వేధించడానికి సిట్లు.. ఖాకీ బుక్కు అందరికి సమానం అనే డిజిపి శివధర్ రెడ్డి .. మీ ఖాకీ బుక్కు కాకి ఎత్తుకుపోయిందా? సజ్జనర్ గారు.. జర్నలిస్టులను బెదిరించావు కదా? ఏమైంది హూంకరింపు? ఇవన్నీ కనిపించడం లేదా?

ఇదొక దండుపాళ్యం ముఠా లెక్క అయ్యింది. కేసీఆర్ పెట్టుబడులకు స్వర్గధామంగా తెలంగాణను తయారు చేస్తే, కాంగ్రెస్ రాగానే బెదిరింపులు, భూ కబ్జాలు.. రేవంత్ రెడ్డికి తెల్వకుండా సెట్ ఎలా వస్తుంది? రేవంత్ రెడ్డికి తెల్వకుండా సెట్ వస్తే ముఖ్యమంత్రిగా నువ్వు ఫెయిల్. నీకు తెల్వ కుండా సెట్ వస్తే నువ్వు ముఖ్యమంత్రిగా ఫెయిల్. సర్కార్ నడుపుతున్నరా,? సర్కస్ నడుపుతున్నరా?

### రేవంత్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. .

బీఆర్ఎస్ జెండా గద్దె జోలికి వస్తే నీ గద్దె కూలుతుంది జాగ్రత్త.. దుమ్ముదుమ్ము అయిపోతవు రేవంత్ రెడ్డి. నువ్వు కూలిస్తే కూలిపోవడానికి బిఆరచవతీచస పార్టీ జెండా గద్దెల్లో లేదు, ప్రజల గుండెల్లో ఉన్నది. తెలంగాణ ప్రజల గుండెల్లో పుట్టిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ..

హౌలా మాటలు బంద్ చేయి.. ఆరు గ్యారెంటీల మీద దృష్టి పెట్టు. క్యాబినెట్ పెట్టుకున్నరు, రైతు బంధుపై, ఎరువుల కొరతపై చర్చ లేదు.. ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిల గురించి చర్చలేదు. ఎన్టీఆర్ గురించి మాట్లాడుతున్నావు.

రాజీవ్ గాంధీ అప్పటి ముఖ్యమంత్రి అంజయ్య ని అవమానిస్తే తెలుగు దేశం పార్టీ పుట్టింది.

ఎన్టీఆర్ కాంగ్రెస్ కు వ్యతిరేకంగా నేషనల్ ఫ్రంట్ పెట్టారు కదా? తెలుగుదేశం పుట్టుకనే కాంగ్రెస్ కు వ్యతిరేకం.. కాంగ్రెస్ భూస్థాపితమే నా లక్ష్యం అని ఎన్టీఆర్ ప్రతిన బూనారు. అంత ప్రేముంటే తెలుగుదేశంలో ఉండాల్సింది. టీడీపీ నుంచి బయటకు వచ్చి నువ్వు ద్రోహం చేసావు

కాంగ్రెస్ భూస్థాపితం అయితే ఎన్టీఆర్ ఆత్మకు శాంతి చేకూరుతుంది.. నాలుగు ఓట్ల కోసం తెలుగుదేశం కోసం మాట్లాడుతున్నావు.. కాంగ్రెస్ దేశం మొత్తం బిజెపికి వ్యతిరేకంగా పోరాడితే, నువ్వేమో బిజేపీ, చంద్రబాబుతో కలిసి ఉంటవు..

కాంగ్రెస్ ఔట్ సోర్సింగ్ సీఎం, అసలైన కాంగ్రెస్ లీడర్ల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి. సైట్ విజిట్ విధానం తప్పు అని నైనీ టెండర్లు రద్దు చేశారు. అదే విధానంలో జరిగిన ఆరు టెండర్లు రద్దు చేయాలి.. ఈ మొత్తం వ్యవహారంపై సిబిఐ విచారణ జరిపించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ని డిమాండ్ చేస్తున్నాం.

వైయసఆర్ వీర విధేయుడిని అని చెప్పుకునే భట్టి , తెలుగుదేశం మీద ప్రేమ చూపే రేవంత్ రెడ్డి ఇద్దరూ తెలంగాణకు వ్యతిరేకంగా పని చేసిన వారే.

అన్ని విషయాలు బయటపెడుతాం అన్న మాటకు కట్టుబడి అన్ని వివరాలు బయట పెట్టాలని భట్టి గారిని కోరుతున్నాం.. కాంగ్రెస్ బొగ్గు స్కాంపై న్యాయస్థానాలకు సైతం వెళ్లి కొట్లాడుతం..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY




# వరుణ్‌తేజ్ మూవీ కొరియన్ కనకరాజు

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' పై అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ హారర్ కామెడీ–ఫాంటసీ ఎంటర్‌టైనర్ నుంచి తాజాగా విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమా పై క్రేజ్‌ను మరింత పెంచింది. వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా ప్రాజెక్ట్ టైటిల్‌తో పాటు గ్లింప్స్‌ను విడుదల చేయగా, అది అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాతో వరుణ్ తేజ్ తొలిసారిగా హారర్ ఫాంటసీ జానర్‌లో అడుగుపెడుతున్నారు. గ్లింప్స్‌లో ఆయన మాస్ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విదేశాల్లోని ఒక పోలీస్ స్టేషన్ నేపథ్యంలో సాగే సన్నివేశంలో, కమెడియన్ సత్యను పోలీసులు కొడుతుండటం, ఆ సమయంలో కామెడీ ట్రాక్ నడుస్తూనే హీరో స్టైలిష్‌గా ఎంట్రీ ఇవ్వడం ప్రేక్షకులకు హుషారును కలిగిస్తోంది.

'వీడు మన కనకరాజు కాదమ్మో' అంటూ సత్య చెప్పే డైలాగ్‌కు, 'నేను తిరిగొచ్చేశా' అంటూ వరుణ్ తేజ్ కొరియన్ భాషలో ఇచ్చే కౌంటర్ ప్రత్యేకంగా హైలైట్ అవుతోంది. ఈ సన్నివేశం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే సీనియర్ నటి తులసి, కమెడియన్ సత్య కీలక పాత్రల్లో కనిపించనున్నారు. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంట్టంల్గ÷న్మెంట్స్ బ్యానర్లపై ఈ సినిమాను భారీ స్థాయిలో సంయుక్తంగా నిర్మిస్తున్నారు. లెజెండరీ కంపోజర్ తమన్ స్వరాలు సమకూరుస్తున్నారు. వరుణ్ తేజ్ ? తమన్ కాంబోలో గతంలో వచ్చిన 'తొలిప్రేమ' సినిమా మ్యూజికల్‌గా పెద్ద హిట్ కావడంతో, ఈ సినిమాపై కూడా మ్యూజిక్ పరంగా భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న ఈ సినిమాను సమ్మర్ సీజన్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. గత కొంతకాలంగా వరుణ్ తేజ్‌కు సరైన కమర్షియల్ హిట్ పడకపోవడంతో, 'కొరియన్ కనకరాజు'తో ఆయన బలమైన కమ్‌బ్యాక్ ఇస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. హారర్, కామెడీ, ఫాంటసీ అంశాలను మేళవిస్తూ రూపొందుతున్న ఈ సినిమా, వరుణ్ తేజ్ కెరీర్‌లో ఒక ప్రత్యేకమైన మైలురాయిగా నిలుస్తుందేమో అన్న అంచనాలు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి.



## దుల్కర్ హీరోయిన్ సాత్విక గ్లింప్స్ విడుదల

దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆకాశంలో ఒక తార' . ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో హీరోయిన్‌ను పరిచయం చేశారు. సాత్విక వీరవల్లి ఇందులో కథానాయికగా నటించనున్నట్లు తెలుపుతూ గ్లింప్స్ విడుదల చేశారు. కనీస వసతులు కూడా లేని పల్లెటూరిలో పుట్టిన అమ్మాయి తన కలలను ఎలా సాధించుకుంది అనే కథాంశంతో ఈ చిత్రం రూపొందనున్నట్లు గ్లింప్స్ ఆధారంగా తెలుస్తోంది. వేసవి కానుకగా ఈ సినిమా విడుదల కానుంది.

## సెకండ్ ఇన్నింగ్స్‌లో రేణూదేశాయ్

టాలీవుడ్ ప్రేక్షకులకు రేణు దేశాయ్ పేరు ప్రత్యేక పరిచయం అవసరం లేదు. సెకండ్ ఇన్నింగ్స్‌లో భాగంగా ఆమె కీలక పాత్రలకే ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నారు. రవితేజ హీరోగా నటించిన టైగర్ నాగేశ్వరరావు సినిమాలో కనిపించిన రేణు దేశాయ్, ఆ తర్వాత కూడా పలు అవకాశాలు తనను వెతుక్కుంటూ వచ్చినట్టు



ఇటీవల వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రేణు దేశాయ్, సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన సర్కారు వారి పాట సినిమాలో తనకు అవకాశం వచ్చిందని తొలిసారిగా వెల్లడించారు. ఆ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్ర కోసం దర్శక నిర్మాతలు తనను సంప్రదించారని, కథ, పాత్ర రెండూ తనకు బాగా నచ్చాయని ఆమె చెప్పారు. నటించాలనే ఆసక్తి కూడా ఉన్నప్పటికీ, కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఆ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందని తెలిపారు. అయితే ఆ కారణాలేమిటన్నది మాత్రం ఆమె స్పష్టంగా చెప్పలేదు. ఆ విషయాలు బయటపెడితే అనవసరమైన వివాదాలు చెలరేగే అవకాశం ఉందని భావించి మౌనంగా ఉండటం మంచిదని నిర్ణయించుకున్నట్టు రేణు చెప్పారు. ఈ వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. నిజంగా వ్యక్తిగత సమస్యలే కారణమా? లేక ఆ అవకాశాన్ని చేజార్చిన మరో నేపథ్యం ఉందా? అనే చర్చ నడుస్తోంది. మహేష్ బాబు సినిమాలో రేణు దేశాయ్ కనిపించలేకపోవడం అభిమానులను నిరాశపరిచినా, ఆమె సెకండ్ ఇన్నింగ్స్‌పై మాత్రం అంచనాలు పెరుగుతున్నాయి. టైగర్ నాగేశ్వరరావు తర్వాత తాజాగా బ్యాడ్ గర్ల్స్ సినిమాలో కీలక పాత్రలో నటించి మరోసారి తన నటనతో ఆకట్టుకున్నారు. సెకండ్ ఇన్నింగ్స్‌లో ఆమె ప్రయాణం ఇప్పుడు కొత్త దిశగా సాగుతోందన్నది అభిమానుల అభిప్రాయం.

## అందరినీ ప్రేమించేతత్వం భారత్ సొంతం

### ఎఆర్ రహమాన్ వ్యాఖ్యలను విభేదించిన తస్లీమా నస్రీన్

తాను ముస్లిం కావడం వల్లే బాలీవుడ్‌లో అవకాశాలు తగ్గాయని, మారిన అధికార సమీకరణాలు కూడా అందుకు ఓ కారణం కావొచ్చని ఆస్కార్ అవార్డు గ్రహీత, సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఆ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ చేసిన వ్యాఖ్యలను బాలీవుడ్ ప్రముఖులతో సహా అందరూ ఖండిస్తున్నారు. తాజాగా సంచలన రచయిత తస్లీమా నస్రీన్ కూడా స్పందించారు. ఆమె తన ఎక్స్ అకౌంట్‌లో ఓ పోస్టు చేశారు.

ఏఆర్ రెహ్మాన్ మనోవేదనను ఆమె తప్పుపట్టారు. రెహ్మాన్ ముస్లిం వ్యక్తే అని, భారత్‌లో ఆయన ఓ ఫేమస్ వ్యక్తి అని, ఇతర ఆర్టిస్టులకన్నా ఆయన సంపాదన ఎక్కువే అని, బహుశా సంపన్న సంగీత దర్శకుడు అయి ఉంటారని, కానీ ముస్లిం కావడం వల్లే బాలీవుడ్‌లో అవకాశాలు రావడం లేదని రెహ్మాన్ ఫిర్యాదు చేస్తున్నారని ఆమె చెప్పారు. బాలీవుడ్‌లో షారూక్ బాద్‌షా అని,



సల్మాన్, ఆమిర్, జావిద్ అక్తర్, షబానా అజ్మీ అందరూ సూపర్ స్టార్లే అని ఆమె తెలిపారు. సంపన్నులు, ఫేమస్ వ్యక్తులకు ఎక్కడ ఇబ్బందికర పరిస్థితులు ఉండవని, ప్రాంతం ఏదైనా, కులం ఏదైనా, వర్గం ఏదైనా సమస్య ఉండదని తస్లీమా అన్నారు. కానీ నాలాంటి పేదలకు సమస్యలు ఉంటాయన్నారు.తాను హేతువాదినని, ఎక్కడకు వెళ్లినా సమస్యలు ఎదుర్కొన్నట్లు చెప్పారు. కానీ ఏఆర్ రెహ్మాన్‌ను హిందువులు, ముస్లింలు, బౌద్ధులు, క్రైస్తవులు, హేతువాదులు విశ్వసిస్తారని, ఆయన మీద జాలిపడే సందర్భం కాదు అన్నట్లు తస్లీమా నస్రీన్ అన్నారు.

## మన శంకర వరప్రసాద్ దూకుడు

### 292 కోట్ల గ్రాస్ కలెక్షన్లతో రికార్డు

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సంక్రాంతి బ్లాక్‌బస్టర్ 'మన శంకర వరప్రసాద్ గారు' బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగిస్తోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ప్రధానంగా ఆకట్టుకునేలా రూపొందిన ఈ చిత్రం విడుదలైనప్పటి నుంచే హౌస్‌ఫుల్ షోలను నమోదు చేస్తూ, అద్భుతమైన వసూళ్లతో ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా మొదటి వారం పూర్తయ్యే సరికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.292 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం ఇదే జోరు కొనసాగితే, అతి త్వరలోనే రూ.300 కోట్ల క్లబ్‌లోకి ఈ చిత్రం అడుగుపెట్టడం ఖాయమని అంటున్నారు. ఈ స్థాయి వసూళ్లతో 2026 సంవత్సరానికి టాలీవుడ్‌కు అదిరిపోయే ఆరంభం లభించినట్టైంది. సంక్రాంతి బరిలో విడుదలైన ఇతర చిత్రాలతో పోలిస్తే, 'మన శంకర వరప్రసాద్ గారు' స్పష్టమైన ఆధిక్యంతో ముందంజలో నిలిచింది. బలమైన కథనం, అనిల్ రావిపూడి మార్క్ కామెడీ టైమింగ్, చిరంజీవి వింటేజ్ స్టైల్ నటన



సినిమాకు ప్రధాన బలంగా మారాయి. పైగా రాబోయే వారం రోజుల పాటు పెద్దగా పోటీ లేకపోవడంతో, వసూళ్లు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో చిరంజీవి పాత్ర ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోగా, నయనతార కథానాయికగా తనదైన ఆకర్షణతో కీలక పాత్ర పోషించింది. కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు పెద్ద ఎత్తున రావడంతో పాటు, అన్ని వయసుల ప్రేక్షకులకు నచ్చే అంశాలు సినిమాలో పుష్కలంగా ఉన్నాయి. కామెడీ, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్‌ను సమతూకంగా మేళవించిన విధానం సినిమాకు ప్లస్ అయింది. సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా, వాణిజ్యపరంగా నిర్మాతలకు భారీ లాభాలను అందిస్తోంది. కలెక్షన్ల జోరు కొనసాగుతుండటంతో, మేకర్స్ ఇంకా బలమైన ప్రమోషన్లను ఎలాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాబోయే రోజుల్లో సినిమా మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశముందని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే, మెగాస్టార్ చిరంజీవి ఖాతాలో మరో బ్లాక్‌బస్టర్‌గా 'మన శంకర వరప్రసాద్ గారు' నిలిచింది. బాక్సాఫీస్ వద్ద కొనసాగుతున్న ఈ ప్రభంజనం, ఈ ఏడాది టాలీవుడ్‌కు గో÷-డలెన్ స్టార్ట్‌గా మారిందని చెప్పొచ్చు.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305**, Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya2025@gmail.com**